

ఒంగోలులో కురుస్తున్న వర్షం

తప్పిన ముప్పు

- జిల్లాపై తుఫాన్ ప్రభావం నామమాత్రం
- కొన్ని ప్రాంతాల్లో జల్లులు
- పెరిగిన చలి తీవ్రత

ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పింది. ఆ ప్రభావం చిరుజల్లులకే పరిమితమైంది. రెండు, మూడు రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతోపాటు ఈదురుగాలులు వీస్తుండంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావం జిల్లాపై అధికంగానే ఉండొచ్చన్న సంకేతాలు తొలుత వాతావరణ శాఖ నుంచి అందాయి. తమిళనాడు తీరంలో చెన్నైకి సమీపంలో తుఫాన్ కేంద్రీకృతమై ఉండటంతో ఆ ప్రభావం జిల్లాపై ఉంటుందని ప్రజానీకం కూడా భావించింది. వాతావరణ శాఖ శుక్రవారం నుంచి మూడురోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అయితే తుఫాన్ ప్రభావం జిల్లాపై అంతగా చూపలేదు. పొరుగున ఉన్న నెల్లూరుతోపాటు తిరుపతి, అన్నమయ్య జిల్లాలలో జోరు వానలు కురుస్తున్నా ఇక్కడ మాత్రం జల్లులకే పరిమితమైంది. అవి కూడా శుక్రవారం సాయంత్రం నుంచి తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని ఒంగోలు, కొత్తపట్నం, సింగరాయకొండ, జరుగుమల్లి, మద్దిపాడు, ఎస్.ఎన్.పాడు, ఎన్‌జీపాడు, కొండపి తదితర మండలాల్లోనే పడ్డాయి. తుఫాన్ ప్రభావంతో ఉష్ణోగ్రతలు తగ్గడంతోపాటు చలితీవ్రత పెరిగింది. మూడు రోజులుగా ఇలాంటి వాతావరణమే నెలకొంది. ఈ పరిస్థితి జిల్లా ప్రజానీకాన్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మరోవైపు వాతావరణంలో వచ్చిన మార్పులతో ఎప్పుడు వర్షం కురుస్తుందోనని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని పొగాకు, శనగ సాగు చేసే రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

పింఛన్ల పండుగ ముందే వచ్చింది. ఊరూవాడా మురిసింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతరత్రా పింఛన్ లబ్ధిదారుల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి కొండంత 'భరోసా' లభించింది. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్ సొమ్ము చేతిలో పడుతోంది. ఆరోజు సెలవు దినమైతే ముందుగానే అందుతోంది. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారమే జిల్లావ్యాప్తంగా పింఛన్‌ల పంపిణీ కోలాహలంగా సాగింది. ఉదయం ఆరు గంటలకే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సొమ్మును అందజేశారు. ఎక్కడికక్కడ టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు భాగస్వామ్యమయ్యారు. రాత్రి 8 గంటలకు సుమారు 2.66 లక్షల మందికి రూ.113.51 కోట్లు (93.04శాతం) అందజేశారు.


ఒంగోలులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్ తదితరులు

ముందుగానే
పింఛన్ల పండుగ

- కోలాహలంగా పంపిణీ
- ఉదయం ఆరు గంటల నుంచే ప్రారంభం
- నెన్నూరుపాడులో పాల్గొన్న మంత్రి స్వామి
- ఇతర ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు, అధికారుల భాగస్వామ్యం

ఒక్కరోజే 93.04శాతం మందికి అందజేత

ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరుసగా ఆరో నెల పింఛన్ల పంపిణీ జిల్లాలో అట్టహాసంగా సాగింది. సాధారణంగా ప్రతి నెలా ఒకటో తేదీన చేపట్టే ఈ కార్యక్రమాన్ని ఈసారి ఒక రోజు ముందుగానే ప్రారంభించారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో నవంబర్ 30నే పంపిణీ చేశారు. అదేసమయంలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. అర్హత కలిగిన వారి నుంచి డిసెంబరులో దరఖాస్తులు తీసుకొని జనవరి నుంచి కొత్త పింఛన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది.

2.66 లక్షల మందికి పంపిణీ

జిల్లాలో ప్రత్యేకించి తూర్పుప్రాంతంలో తుఫాన్ ప్రభావంతో చలి వాతావరణం, చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ పలుచోట్ల శనివారం ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ మొదలైంది. కొండపి మండలం నెన్నూరుపాడులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి లాంఛనంగా ప్రారంభించారు. మద్దిపాడు మండలం మారెళ్లగుంటపాలెంలో ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. దర్శి పట్టణంలో చేపట్టిన పింఛన్‌ల పంపిణీలో ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావుతో కలిసి పాల్గొన్నారు. త్రిపురాంతకం మండలం ముడివేములలో టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పంపిణీ చేశారు. ఇతర అన్ని పట్టణాలలోని వార్డులు, గ్రామాలలో స్థానిక అధికార పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాలో 2.86 లక్షల మందికి సుమారు రూ.122 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా రాత్రి 8 గంటలకు సుమారు 2.66 లక్షల మందికి రూ.113.51 (93.04శాతం) కోట్లు అందజేశారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఒంగోలులో పాల్గొన్న టీడీపీ ప్రజాప్రతినిధులు

ఒంగోలులో నిర్వహించిన దిశ సమావేశంలో పాల్గొన్న అనంతరం పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నగరంలోని సంతపేటలో పింఛన్‌ల పంపిణీకి హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దిశ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తదితరులు

పకడ్బందీగా పథకాల అమలు

- దిశ సమావేశంలో మంత్రి డోలా, ఎంపీ మాగుంట
- సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశంలో వారు పాల్గొన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ జాతీయ రహదారులకు సంబంధించి తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను, తాగునీటి పథకాలను

మిగతా 6వ పేజీలో


దివ్యాంగుల కోసం సిద్ధం చేస్తున్న కృత్రిమ కాళ్లు

అడవి బిడ్డలకు ఆర్డీటీ వెలుగు

- సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిగా నిలుస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్
- వెయ్యికిపైగా ఉచిత పక్కా గృహాల నిర్మాణం
- ఉన్నత వైద్యం, విద్యకు ప్రోత్సాహం
- దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు
- మానసిక దివ్యాంగులకు ఆపన్న హస్తం

7 లో

వైపాలెం టీడీపీలో అదేతంతు

- మంగళగిరి వెళ్లిన మరో బృందం
- సీరియస్ అయిన రాష్ట్ర నాయకత్వం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో పాత కథ పునరావృతమవుతోంది. అందుకు ఇటీవల అటు రాష్ట్ర, ఇటు జిల్లా నేతల వద్ద నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు ఫిర్యాదులు చేసుకోవడం దర్పణం పడుతోంది. 15 రోజుల క్రితం ఎర్రగొండపాలెం మండలానికి చెందిన కొందరు టీడీపీ శ్రేణులు రాష్ట్ర నాయకుల వద్దకు వెళ్లి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుపై ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే నియోజకవర్గానికి చెందిన ముఖ్యనాయకులంతా ఎరిక్షన్‌బాబుకు మద్దతుగా ఆపార్టీ పార్లమెంట్ అధ్యక్షుడిని కలిసి మంగళగిరి వెళ్లిన శ్రేణులపై ఆరోపణలు చేశారు. తిరిగి శనివారం దోర్నాల మండలం నుంచి మరో బృందం ఎరిక్షన్‌బాబుకు వ్యతిరేకంగా రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లింది.

ఆరంభం నుంచీ అంతే..

ఎర్రగొండపాలెం నియోజకవర్గం 2009లో పునఃప్రారంభమైంది. అప్పటి నుంచి దళితులకు కేటాయించారు. స్థానికంగా దీటైన నాయకుడు లేకపోవడంతో బయటి నేతలకు పోటీచేసే అవకాశం టీడీపీ కల్పిస్తూ వచ్చింది. 2009లో పోటీచేసి ఓడిపోయిన డేవిడ్‌రాజు 2014 ఎన్నికల నాటికి వైసీపీలో చేరారు. టీడీపీ అజితారావును అభ్యర్థిగా రంగంలోకి దింపింది. ఆ ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఆమె పెత్తనం ప్రారంభమైంది. వెంటనే నియోజకవర్గంలో ఉన్న స్థానిక నాయకులు ముఖ్యంగా ఒక సీనియర్ నేత అండతో ఆమెకు వ్యతిరేకంగా పనిచేయడం ప్రారంభించారు. అప్పట్లో అజితారావు వైపు నుంచి సమస్యలు ఉండటంతో ఆమెను తొలగించి ముగ్గురు స్థానిక నాయకులతో

మిగతా 6వ పేజీలో

విచారణకు హాజరైన ఎమ్మెల్యే చంద్రశేఖర్

- వైపాలెం సర్కిల్ కార్యాలయానికి వెళ్లి పలు ప్రశ్నలకు సమాధానాలు

6

వామ్మో.. పులి

- పెద్దబొమ్మలాపురం సమీపంలో సంచారం
- భయాందోళనలో ప్రజలు



వివరాలు 6వ పేజీలో

ప్రాణం తీసిన గేటు!

- ఆడుకుంటుండగా ఊడిపడి నాలుగేళ్ల చిన్నారి మృతి
- గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో విషాదం

6 లో





కల్చరల్ ఫెస్ట్.. అదుర్స్

ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో శనివారం కల్చరల్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆట, పాటలు ఆదుర్స్ అనిపించాయి.

\- ఒంగోలు కల్చరల్

బీమాతో రైతుకు ధీమా

- రబీలో ఆరు పంటలకు వర్తింపు
- రుణాలు పొందిన వారికి నేరుగా బ్యాంకు నుంచే ప్రీమియం చెల్లింపు
- ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

వివరాలు 7వ పేజీలో

గ్రానైట్ ఫ్యాక్టరీ గేటు పడి చిన్నారి దుర్మరణం


మృతిచెందిన సూర్య

మద్దిపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలోని చంద్రలేఖ గ్రానైట్ ఎక్స్‌పోర్ట్సు ఫ్యాక్టరీలో గేటు పడి ఓ చిన్నారి దుర్మరణం చెందాడు. తిమ్మన్నపాలెంకు చెందిన రాయపాటి సూర్య(4) గేటు ఎక్కి ఆడుకుంటుండగా అది ప్రమాదవశాత్తు ఊడి అతనిపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు రావిపాటి ప్రవీణ్ దంపతులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలుసుకున్న మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

మెరుగైన చికిత్సకు లోకేశ్ ఆదేశం

బల్లికురవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుంటూరు శ్రీనివాసరావుచౌదరి శనివారం అప్పుల బాధలతో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు.. గొర్రెపాడుకు చెందిన శ్రీనివాసరావు అనే యువకుడు కొంత కాలంగా ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాడు. గతంలో నారా లోకేశ్ టీంలో పనిచేసి ఈ మధ్య కాలంలో స్వగ్రామానికి చేరాడు. అవివాహితుడైన శ్రీనివాసరావుకు అప్పులు బాగా పెరిగాయి. దీంతో ఏం చేయాలో పాలుపోక తన ఇంటిలోనే పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాసరావును గుర్తించిన కుటుంబ సభ్యులు చిలకలూరిపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. విషయాన్ని వారి బంధువులు మంత్రి లోకేశ్ టీం దృష్టికి, మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ వెంటనే టీడీపీ కార్యకర్త శ్రీనివాసరావుకు మెరుగైన చికిత్సను అందించాలని తన టీం సభ్యులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు సమాచారం.

పరామర్శించిన హర్షవర్ధన్

చిలకలూరిపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త గుంటూరు శ్రీనివాస్‌చౌదరిని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ పరామర్శించారు. వైద్యులను అడిగి శ్రీనివాస్ చౌదరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే ఏర్పాటు చేయాలన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

20 నిమిషాలలో 44 అంశాలకు ఆమోదం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ సమావేశం శనివారం మొక్కుబడిగా జరిగింది. చైర్ పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన 44 అంశాలను ఆమోదించారు. 20 నిమిషాలలో అన్ని అంశాలు చదవడం పూర్తి కాగా, చైర్ పర్సన్ ఎస్తేరమ్మ ఆమోదించినట్లు ప్రకటించారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్‌లలో ఏ ఒక్కరూ నోరు విప్పలేదు. ఏ ఒక్క అంశం పైనా చర్చ చేయలేదు. కనీసం ప్రజా సమస్యలను కూడా కౌన్సిల్‌లో చర్చించకపోవడం విమర్శలకు తావిస్తుంది. వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ఈపూరుపాలెంలో పలుచోట్ల చోరీకి యత్నం

- పలు దుకాణాల తలుపులు పగులగొట్టిన దుండగుడు
- మీ సేవా కేంద్రంలో రూ.40వేల అపహరణ
- సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు
- తూర్పు గోదావరి వ్యక్తిగా గుర్తింపు
- పాత దొంగగా ఆనవాళ్లు


సీసీ పుటేజీకి చిక్కిన చోరీకు పాల్పడిన దుండగుడు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి పలు దుకాణాల్లో చోరీలకు యత్నించాడు. దర్జాగా దొంగతనానికి ఉపయోగకరంగా ఉండే విధంగా లైటును తయారు చేసుకొని పలు దుకాణాల తలుపలను ఓపెన్ చేసి విఫలమయ్యాడు. అయితే మీ సేవా కేంద్రంలోకి చొరబడి రూ.40వేలు నగదును అపహరించాడు. ఉదయాన్నే విషయం తెలుసుకున్న సెంటర్ నిర్వాహకుడు కాటూరి చెంబయ్య దుకాణంలో వస్తువులు చిందరవందరగా ఉండడమే కాకుండా నగదు అపహరణఅయినట్లు గుర్తించారు. వెంటనే ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ క్లూస్ టీం సహాయంతో ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు.

నిందితుడిని ఇప్పటికే పసిగట్టిన పోలీసులు

చోరీలకు పాల్పడిన వ్యక్తిని సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఇతని వయసు సుమారు 40 ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. ఇతడు గతంలోనూ పట్టణంలో పలు చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈక్రమంలోనే గాలింపు చర్యలు ప్రారంభించారు.


క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్న రూరల్ సిఐ శేషగిరిరావు

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

పంగులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే గ్రామాలలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో శుక్రవారం రాత్రి అధికారులతో కలసి విఠలేశ్వర్ పల్లెనిద్రను చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో జరిగిన సమావేశంలో ఏఎస్పీ వారి సమస్యలను తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలు, చెడు వ్యసనాలతో ఉన్న వ్యక్తుల సమాచారం తెలుసుకున్నారు. సమాజంలో సైబర్ నేరాలు జరిగే తీరును వివరించిన ఏఎస్పీ ప్రజలు వాటిబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. రోడ్డు ప్రమాదాలబారిన పడకుండా పాటించాల్సిన నిబంధనలు, ప్రయాణ సమయంలో హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. మహిళలు, చిన్నారులకు పోలీస్ రక్షణగా ఉంటుందని, ఎవరైన వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని విఠలేశ్వర్ హెచ్చరించారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు, 112 నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు, ఎస్‌ఐ వినోద్‌బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వామ్మో.. పులి

● పెద్దబొమ్మలాపురం సమీపంలో సంచారం ● భయాందోళనలో ప్రజలు

పెద్దదోర్నాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబొమ్మలాపురం వద్ద పులి సంచరిస్తోంది. గ్రామానికి సమీపంలోని గండి చెరువు వద్ద దాన్ని కొందరు గ్రామస్థులు చూశారు. దీంతో భయాందోళన చెందుతున్నారు. గండి చెరువు నల్లమల అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉండటంతో నీరు తాగేందుకు అక్కడికి తరచూ వన్యప్రాణులు వస్తుంటాయి. దానికి సమీపంలోనే వ్యవసాయ పొలాలు ఉన్నాయి. ఆ భూముల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు పనుల కోసం వెళుతున్న క్రమంలో పెద్దపులి కనిపించినట్లు చెప్తున్నారు. ఇటీవల వెలగలపాయ, రాచర్ల తదితర పొలాల్లో పెద్దపులి సంచరించింది. పశువులపై కూడా దాడులు చేసిన నేపథ్యంలో గ్రామస్థులు మరింత భయాందోళనలకు గురవుతున్నారు. అటవీ శాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విచారణకు హాజరైన ఎమ్మెల్యే చంద్రశేఖర్

● వైపాలెం సర్కిల్ కార్యాలయానికి వెళ్లి పలు ప్రశ్నలకు సమాధానాలు


ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరైన ఎమ్మెల్యే చంద్రశేఖర్

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ప్రలోభాలకు గురిచేశారన్న ఆరోపణల మేరకు నమోదైన కేసులపై విచారణకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం హాజరయ్యారు. ఆయన స్థానిక సీఐ కార్యాలయానికి వచ్చి పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వైసీపీ ఎమ్మెల్యే అయిన తాటిపర్తి చంద్రశేఖర్‌పై గత ఎన్నికల సమయంలో నాలుగు కేసులు నమోదయ్యాయి. దీంతో పాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై ఎక్స్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేయడంపై స్థానిక టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మరో కేసు నమోదైంది. ఈ కేసుల్లో విచారణకు హాజరుకావాలని ఆయనకు పోలీసులు రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం సీఐ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య ఎదుట హాజరయ్యారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కావాలనే కుట్రపూరితంగా కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తోందని ఆరోపించారు. ఇకనైన పద్ధతి మార్చుకోకపోతే ఆందోళనకు దిగుతామన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంత కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యుడు చేదూరి విజయభాస్కర్ నాయకులు ఉన్నారు.

వైపాలెం టీడీపీలో అదే తంతు

(5వ పేజీ తరువాయి)

త్రిసభ్య కమిటీని టీడీపీ ఏర్పాటు చేసింది. 2019 ఎన్నికల నాటికి అభ్యర్థి కరువవ్వడంతో అజితారావును మళ్లీ తెచ్చి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి తర్వాత మళ్లీ ఆమె కనుమరుగయ్యారు. స్థానిక నాయకులు పెత్తనం చేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం వ్యూహాత్మంగా పార్టీ సీనియర్ అయిన ఎరిక్షన్‌బాబుకు సాధారణ ఎన్నికలకు మూడేళ్ల ముందుగానే ఎర్రగొండపాలెం బాధ్యతలు అప్పగించి అక్కడికి పంపింది. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఆయన ఓటమి చెందారు.

రాష్ట్ర నాయకత్వం ఆగ్రహం

ప్రస్తుతం ఎర్రగొండపాలెం ఇన్‌చార్జిగా ఎరిక్షన్‌బాబు హవా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పూర్వం నుంచి పెత్తనం చేస్తున్న కొందరు నాయకులు ఆయన్ను వ్యతిరేకించడం ప్రారంభించారు. ముందుగా ఎర్రగొండపాలెం మండలం నుంచి రాష్ట్ర నాయకుల వద్దకు వెళ్లిన బృందంలో ఒకరిద్దరు అనాదిగా టీడీపీలో పనిచేస్తున్న వారు కాగా, మిగిలిన వారిలో టీడీపీలో పదవులు లేనివారే ఎక్కువ. గత ప్రభుత్వంలో వైసీపీతో అంటకాగిన ఇద్దరు అధికారులను బదిలీ చేయకుండా ఆపారని ఎరిక్షన్‌బాబుపై వారు ఫిర్యాదు చేశారు. తదనంతరం ఎరిక్షన్‌బాబుకు మద్దతుగా పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడి వద్దకు వచ్చిన అన్ని మండలాల నాయకులు ఆ ఆరోపణలు తోసిపుచ్చారు. ఆ ఇద్దరు అధికారుల బంధువర్గం గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీకి మద్దతుగా పనిచేయడంతో అక్కడ నాయకుల నుంచి వారికి మద్దతుగా సిఫార్సులు వచ్చాయని చెప్పారు. ఈ రగడపై రాష్ట్ర నాయకత్వం కన్నెర్ర చేసింది. అన్నీ పరిష్కరిస్తామని, సైలెంట్‌గా ఉండాలని ఆదేశించింది.

ఓ సీనియర్ నేత ప్రోద్బలంతోనే ఫిర్యాదులు

దోర్నాల మండలంలోని కాంట్రాక్టర్ అయిన టీడీపీ మాజీ నాయకుడి ఆధ్వర్యంలో శనివారం మరికొందరు ఎరిక్షన్‌బాబుకు వ్యతిరేకంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి వద్దకు వెళ్లారు. అయితే రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు వచ్చిన వారందరినీ కార్యాలయంలోకి రానివ్వకుండా వారిని తీసుకెళ్లిన ఒక నాయకుడితో మాట్లాడి.. ఇలా రాష్ట్ర ఆఫీస్‌కు అనుచరులను తీసుకురావడం పద్ధతి కాదని హితవు చెప్పి పంపినట్లు తెలిసింది. అయితే రెండు మండలాల నుంచి ఎరిక్షన్‌బాబుకు వ్యతిరేకంగా రాష్ట్ర నాయకుల వద్దకు వెళ్లినవారు నియోజకవర్గంలో ఒక సీనియర్ నాయకుడి ఆశీస్సులతోనే కదిలారని ఎరిక్షన్‌బాబు మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. తొలి నుంచి పార్టీలో పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతుందనే తాము రాష్ట్ర నాయకుల వద్దకు వెళ్లాల్సి వచ్చిందని ఎరిక్షన్‌బాబును వ్యతిరేకించే వారు చెబుతున్నారు. నిజానికి ఆ నియోజకవర్గంలో కొత్తగా వచ్చిపడిన సమస్యలు ఏమీ కనిపించడం లేదని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. ఇతర చాలా నియోజకవర్గాల కన్నా ఇక్కడ అదనంగా చోటుచేసుకున్న వ్యవహారాలు ఏమీలేవని కూడా పలువురు అంటున్నారు. దీంతో నియోజకవర్గం ఆరంభం నుంచి ఉన్న ఆధిపత్య పోరే మళ్లీ ప్రారంభమైందన్న అభిప్రాయాన్ని అక్కడి పార్టీ శ్రేణులు బహిరంగానే వ్యాఖ్యానిస్తున్నాయి. రాష్ట్ర నాయకత్వం ఇప్పటికైనా మేల్కొని తగు చర్యలు తీసుకోకపోతే రగడ మరింత రచ్చకెక్కే అవకాశం ఉంది.

పకడ్బందీగా పథకాల అమలు

(5వ పేజీ తరువాయి)

త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, సైడు కాలువల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాం : ఎంపీ మాగుంట

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి మంజూరు చేసిన నిధులను మండలాలు, గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని సూచించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ జిల్లాలో లఖ్‌పతి దీదీ పథకం విజయవంతంగా అమలవుతున్నదన్నారు. సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా సూర్యఘర్ పథకాన్ని జిల్లాలోని 5లక్షల ఇళ్లకు విస్తరించడంపై దృష్టి సారించాలన్నారు.

ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలు ఇవీ..



● ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ నగరానికి పశ్చిమం వైపు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని కోరారు. అమృత్ పథకం కింద చేపట్టిన పనులు పూర్తి చేస్తే ఒంగోలుకు రోజూ తాగునీరు ఇవ్వొచ్చన్నారు.



● సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేర్నమిట్ట వద్ద ఉన్న చెరువును అమృత్ పథకంలో చేర్చాలని కోరారు. గుండ్లకమ్మ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు సంబంధించి రెండు మోటార్లు పనిచేయడం లేదని, కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.



● కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్‌హెచ్ 656 జాతీయ రహదారిలో మగ్గంపల్లి వద్ద లైట్స్ పనిచేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సమావేశం దృష్టికి తెచ్చారు. తాగునీటి పథకాలకు సంబంధించి కొత్త పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం ఉందని తెలిపారు.



● గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డీఆర్వో చినఓబులేషు, జడ్పీ సీఈవో చిరంజీవి, సీపీవో వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులతోపాటు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్‌ను వినియోగించుకోవాలి

» ఎమ్మెల్యే కొండయ్య


లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులు పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. 1వ తేదీ ఆదివారం రావడంతో ముందుగానే శనివారం పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మండల పరిధిలో తోటవారిపాలెం, బుర్లవారిపాలెం గ్రామాల్లోను, చీరాల మున్సిపల్ పరిధిలోని 10, 11 వా ర్డుల్లో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పేరాల మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముత్యాలపేట వీవీ స్పెషల్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హ యాంలో జగన్ బటన్ నొక్కుతున్నాననం టూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిని గాడిలో పెట్టేందుకు నిర్విరామంగా పనిచేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ప్రజా ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం నినాదాలతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఆయా ప్రాంతాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పంగులూరులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు

అద్దంకి మండలంలో 96 శాతం పంపిణీ

అద్దంకిటౌన్ : లబ్ధిదారులకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బత్తిని సింగయ్య అన్నారు. శనివారం మండలంలోని బొమ్మనంపాడు, నాగులపాడు గ్రామాలల్లో జరుగున్న పింఛన్‌ల పంపిణీని ఆయన పరిశీలించారు. శనివారం మండలంలో 96శాతం పంపిణీ చేసి, బాపట్ల జిల్లాలో మొదటి స్థానంలో అద్దంకి ఉందని సింగయ్య తెలిపారు.

పంగులూరు : మండలంలో శనివారం 93 శాతం పింఛన్‌లను పంపిణీ చేశారు. 21 గ్రామ పంచాయతీలలో 7,862 మందికిగాను 7,310 మందికి పింఛన్ ఇచ్చినట్లు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో శనివారం సాయంత్రానికి 94 శాతం పింఛన్‌ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో కె. కుసుమకుమారి తెలిపారు. మండలంలో 7646 మందికి గాను 7204 మందికి అందించామని మిగిలిన వారికి వెంటనే అందించేలా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో పేర్కొన్నారు.

చినగంజాం : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి పరిశీలించారు. చినగంజాం, కడవకుదురు, మున్నంవారిపాలెం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, పల్లెపాలెం తదితర గ్రామాల్లో పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీల్లో 5901 మందికి గాను 5670 మందికి పింఛన్ పంపిణీ చేసి 97శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.


పల్లెపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసమూర్తి


భగవద్గీత పుస్తకాలతో బాలికలు

జ్ఞానాన్ని పెంచే భాండాగారం భగవద్గీత

పంగులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత విద్యార్థుల మేధస్సును పెంచే జ్ఞాన భాండాగారం అని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం భగవద్గీత పుస్తకాలను అందచేశారు. ప్రతి వ్యక్తి చదవాల్సిన మంచి పుస్తకం భగవద్గీత అని ఆయన సూచించారు. కార్యక్రమంలో దాస సాహిత్య మండల కోఆర్డినేటర్ ధూళిపాళ్ల పార్వతి, అన్నాబత్తిన అరుణ, పాఠశాల హెచ్ఎం. పుచ్చకాయల ప్రసాద్, జాగర్లమూడి కవిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళకు కుట్టుమిషన్ అందజేత

మార్టూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆశ్రమంలో శనివారం రోటరీ క్లబ్ సభ్యులు రమణ అనే మహిళకు కుట్టుమిషన్ అందచేశారు. ఆశ్రమంలో గత 3 నెలలుగా మహిళలకు కుట్టు మిషనులో శిక్షణ ఇచ్చారు. వారి శిక్షణ పూర్తికావడంతో 26 మందికి సర్టిఫికెట్లను ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందు ఆధ్వర్యంలో అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు రావుల బాపయ్య సాయం అందజేశారు. కార్యక్రమంలో రావి అంకమ్మచౌదరి, మద్దుమాల కోటేశ్వరరావు, సాంబశివరావు, ఆంజనేయులు, కంటి వైద్యుడు కె సుబ్రమణ్యం, షేక్ కాజా హుస్సేన్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి

పర్చూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజీ మార్గంలో ఇరువర్గాలు కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందని, దీనిపై అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.శాంతి అన్నారు. శనివారం కోర్టు భవనాల సముదాయంలో డిసెంబర్ 14న నిర్వహించే లోక్‌అదాలత్‌పై పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి శాంతి మాట్లాడుతూ ఎవరినీ బలవంతంగా రాజీ పడేలా మాట్లాడవద్దని పోలీసు అధికారులకు సూచించారు. ఇరువురి అంగీకారంతోనే కేసులను పరిష్కరించాలన్నారు. లోక్ అదాలత్ వల్ల డబ్బుతోపాటు, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఈ సమీక్షలో కాంచేడు, ఇంకొల్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభాకర్‌రెడ్డి, గిరిజ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

పాత్రలతో అందరికీ గుర్తుండిపోతారు

అద్దంకిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సినిమాలలో నటులు తమకు ఇచ్చిన పాత్రలతో అలరించి ప్రజల మనస్సులో ఎల్లప్పుడూ గుర్తుండి పోతారని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. శనివారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభ మూర్తులు - మధురస్మృతుల సభ జ్యోతి చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సినీ నటులు ప్రభాకర్‌రెడ్డి, మరో నటి గిరిజ చిత్రపటాలకు సభ్యులు నివాళులర్పించారు. ప్రభాకర్‌రెడ్డి నటించిన చిత్రాలు, ప్రాధాన్యతను దాసరి లక్ష్మి, నటి గిరిజ గురించి గ్రంధి నాగరాజ కుమారి ప్రసంగించారు. కార్యక్రమానికి సీతారామశాస్త్రి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, చప్పిడి వీరయ్య, అన్నమనేని వెంకట్రావు, ఆర్‌వీ రాఘవరావు, డాక్టర్ దేవపాలన, చందలూరి నారాయణరావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చీరాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలకు చెందిన వారికి సంబంధించి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య శనివారం పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. చుక్కా నాగవెంకట్ (గంజి పాలెం)కు రూ.88,478, వెంకటసాయి మణికంత (పాపరాజుతోట) రూ.1,00,516, రామేశ్వరం అభినవ్(ఈపురుపాలెం) రూ.2.50లక్షలు, చల్లా శ్రీనివాస్(విఠల్‌నగర్) రూ.88,346, నర్రా ఆంజనేయులు (గవినివారిపాలెం)రూ.52,292, బీ శ్రీనివాసరావు (హరిప్రసాద్‌నగర్) రూ.28,848, ఎనుములు మల్లేశ్వరి (బుర్లవారిపాలెం), రూ.20వేల చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు


మేదరమెట్లలో వెలగని వీధి దీపాలు

మేదరమెట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో వీధి దీపాలు వెలగడం లేదు. నాలుగు నెలలుగా వీధి దీపాలు వేలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సెంటర్‌లోని పాత మద్రాస్ రోడ్డులో రహదారులు, భవనాల శాఖ రెండు సంవత్సరాల కిందట వీధి దీపాలను ఏర్పాటు చేసింది. పాత చెక్ పోస్టు సెంటర్ నుంచి పాత గుంటూరు రోడ్డులోని పాత మార్కెట్ సెంటర్ వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బస్టాండ్ ముందు డివైడర్ లేకపోవడంతో అక్కడ లైట్లు వేయలేదు. వేసిన సంవత్సరానికే కొన్ని బల్బులు పోయాయి. ముఖ్యంగా మేదరమెట్ల కూడలిలో ఏర్పాటు చేసిన లైట్లు వెలగకపోవడంతో సెంటర్‌లోకి వచ్చి వెళ్లేవారు, దుకాణాల వారు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి 10 గంటల తరువాత ఈ ప్రాంతమంతా చీకటిగా ఉంటుంది. రాత్రివేళ వేరే ప్రాంతాల నుంచి మేదరమెట్ల వచ్చేవారు లైట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా లైట్లు లేకపోవడంతో అవి సక్రమంగా పని చేయడం లేదని దుకాణ యజమానులు అంటున్నారు. చుట్టుపక్కల ప్రాం తాలకు మేదరమెట్ల కూడలి కావడంతో ఇక్కడ విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త లైట్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తండ్రిని చంపిన కొడుకు అరెస్ట్

అద్దంకి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తండ్రి ముప్పరాజు వెంకటేశ్వర్లును హత్య చేసిన కుమారుడు సుబ్బారావును శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం కశ్యాపురానికి చెందిన ముప్పరాజు వెంకటేశ్వర్లు కుటుంబం అద్దంకి పట్టణంలోని భాగ్యనగర్ 3వ లైన్‌లో ఉంటున్నారు. భార్య 20 సంవత్సరాల కిందట, తల్లి రెండేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో తండ్రి, కొడుకులు మాత్రమే ఉంటున్నారు. లారీ క్లీనర్ గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు కశ్యాపురంలో ఉన్న 80 సెంట్ల స్థలాన్ని 9 లక్షలకు అమ్మి వచ్చిన డబ్బుతో తండ్రీకొడుకులు జీవనం సాగిస్తున్నారు. కుమారుడు సుబ్బారావు మద్యానికి బానిసయ్యాడు. డబ్బు విషయమై ఇద్దరి మధ్యా తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి తండ్రి, కొడుకులు గొడవపడ్డారు. తండ్రి వెంకటేశ్వర్లును కుమారుడు సుబ్బారావు బలంగా కొట్టడంతో రక్తస్రావం కావడంతో మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు. సుబ్బారావును శనివారం కలవకూరు క్రాస్ రోడ్స్ వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

చిన్న పని చేసి పెద్ద గౌరవాలను కోరుకునే సంస్థలు, వ్యక్తులు చాలా మంది ఉన్నారు. ప్రభుత్వ నిధులను కాజేయడానికే ఏర్పడిన సంస్థలు మరికొన్ని ఉన్నాయి. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవే పరమార్థంగా పనిచేసే సంస్థ ఉంటే ప్రతి ఒక్కరూ సలాం కొడతారు. అటువంటి సంస్థే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ). 'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అన్నట్లు ఈ సంస్థ పనిచేస్తోంది. ఇతోధికంగా నిధులు వెచ్చిస్తూ అడవి బిడ్డలైన చెంచు గిరిజనుల జీవనశైలిని మార్చే ప్రయత్నం చేస్తోంది. వారి జీవనోపాధి పెంచే మార్గాలు చూపుతోంది. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను అధికారులు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వారిలో చైతన్యం నింపుతోంది. వారు నివసించే స్థలాలకు రెవెన్యూ అధికారులతో చర్చించి నివేశన పట్టాలను మంజూరు చేయించి, పూర్తి ఖర్చులతో పక్కా గృహాలను నిర్మించి ఇస్తోంది. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తున్న ఆర్డీటీ సంస్థపై ప్రత్యేక కథనం..


దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేసిన సిబ్బంది

అడవి బిడ్డలకు ఆర్డీటీ వెలుగు

సేవా కార్యక్రమాలతో స్ఫూర్తిగా నిలుస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్

వెయ్యికిపైగా ఉచిత పక్కా గృహాల నిర్మాణం

- ఉన్నత వైద్యం, విద్యకు ప్రోత్సాహం
- దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతుల అందజేత
- మానసిక దివ్యాంగులకు ఆపన్న హస్తం
- మరెన్నో ఉపాధి కార్యక్రమాలు.. శిక్షణ


సంస్థ నిర్మించిన గృహ సముదాయం

సేవే లక్ష్యంగా స్థాపన

స్పెయిన్ దేశం నుంచి 1969లో భారతదేశం సంస్కృతి సాంప్రదాయలను చూడాలని వచ్చిన ఫాదర్ ఫెర్రర్ పేదల దుస్థితి చూసి చలించి సేవా కార్యక్రమాలు చేయాలని భావించాడు. అనంతపురం జిల్లాలో ఆర్‌డీటీ సంస్థను ఏర్పాటు చేసి పేదలకు తోడ్పాటు నందించారు. అనంతరం ఆయన ఆశయాలకు అనుగుణంగా ఆయన కుమారుడు మాంచో ఫెర్రర్ కూడా సేవలను పలు జిల్లాలకు విస్తరించినట్లు సంస్థ రీజనల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. ఈ నేపథ్యంలో వెనుకబడిన చెంచు గిరిజనుల అభివృద్ధి కోసం 2010న ఈ జిల్లాలో కార్యాచరణను ప్రారంభించినట్లు తెలిపారు.

పెద్ద దోర్నాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతో అవయవ లోపాలున్నవారికి, ప్రమాదంలో కాలు, చేయి కోల్పోయినవారికి కృత్రిమ అవయవాలు అందజేయడంతో పాటు, మానసిక దివ్యాంగులకు పునరావాసం కల్పించి వారి ఎదుగుదలకు ఆర్‌డీటీ సంస్థ తోడ్పాటు అందిస్తోంది. దోర్నాల మండలం చిన్నగుడిపాడు సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారికి పక్కన ఈ సంస్థ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఆ పక్కనే కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని నిర్మించి సేవలందిస్తున్నారు. స్పెయిన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ సహకారంతో 2022 నవంబరు 14వ తేదీన మానసిక దివ్యాంగులైన చిన్నారులకు పునరావాస కేంద్రాన్ని నిర్మించారు. ప్రకాశం జిల్లాతో పాటు నంద్యాల, పల్నాడు జిల్లాల్లోనూ, తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లోనూ మానసిక దివ్యాంగులైన చిన్నారులను గుర్తించి వారికి పునరావాసం కల్పించి వారి ఎదుగుదలకు అవసరమయ్యే తర్ఫీదు ఇస్తున్నారు. ఇందుకోసం శిక్షణ పొందిన ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించారు.


మానసిక దివ్యాంగ చిన్నారులకు బోధిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయిని

ఏమేం చేస్తున్నారంటే..


ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు

- గిరిజనుల గూడేలకు వెళ్లి వైద్యం అందించడంతో పాటు వారికి కావాల్సిన అవయవాల తయారీకి కొలతలు తీసుకుని కృత్రిమ అవయవాలు తయారు చేసి వారికి అమరుస్తున్నారు.
- ఇప్పటికే 600లకుపైగా జైపూర్ కాళ్లు, వెన్నుముకకు సంబంధించిన వీల్‌చైర్, ట్రైసైకిళ్లు, నడక కర్రలు, తదితర పరికరాలు అందజేశారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ కూడా చేస్తున్నారు.
- విస్తరాకుల తయారీ, కుట్టు మిషనులో శిక్షణ నిచ్చి అనంతరం ఉచితంగా మిషన్లను అందజేస్తున్నారు. మూలనిధులను అందజేస్తూ తోడ్పాటు అందిస్తున్నారు.
- వ్యవసాయం చేసుకునే గిరిజన రైతులకు ఎడ్లు, విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారు.
- ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- గూడేల్లోని గర్భిణులు, బాలింతలు, క్షయ రోగులను గుర్తించి నెలనెలా పౌష్టికాహారం అందజేస్తున్నారు.
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ఉన్నత వైద్యం, బాగా చదివే పేద విద్యార్థులకు పూర్తిగా సొంత ఖర్చుతో ఉన్నత విద్యను అందిస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కడతాం

ఒక్కో గృహం రూ.2.5 లక్షలతో 52 గ్రామాల్లో 1334 పక్కా గృహాలను నిర్మించారు. మరో 211 గృహాలు నిర్మాణంలో ఉన్నాయి. విద్య, వైద్యంతో పాటు గిరిజన మహిళలను చైతన్యవంతులను చేసి ఆర్థికాభివృద్ధి చెందేందుకు పలు చర్యలు చేపట్టారు. మున్ముందు మెరుగైన ఉన్నత వైద్యం అందించేందుకు ఇక్కడే సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మించనున్నారు.

- నాగరాజు, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్


దేవాంగపురి పంచాయితీ కార్యాలయం


జాండ్రపేట రైల్వేస్టేషన్

ఒక ఊరు.. రెండు పేర్లు

- రాష్ట్ర ప్రభుత్వ రికార్డుల్లో దేవాంగపురి
- కేంద్ర ప్రభుత్వ రికార్డుల్లో జాండ్రపేట
- ఆధార్ కార్డుల్లో రెండు పేర్లతో నమోదు

చీరాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలంలో ఒక గ్రామానికి రెండు పేర్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఆ ఊరి పేరు జాండ్రపేటగా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ రికార్డుల్లో దేవాంగపురి అని ఉంటుంది. ఈ క్రమంలో ఆధార్ కార్డుల్లో ఊరిపేరు వద్ద దేవాంగపురి, జాండ్రపేటగా ఉంటుంది. రెండు పేర్లు ఉండడం వల్ల ఎవరికీ ఇబ్బంది లేదని గ్రామస్థులు చెప్తున్నారు. జాండ్రపేట, దేవాంగపురి మేజర్ పంచాయతీ. చేనేతలో దేవాంగ సామాజిక వర్గానికి చెందినవారు ఎక్కువగా ఉంటారు. ఈ క్రమంలో దేవాంగపురి అనే పేరు వచ్చినట్లు కొందరు చెప్తున్నారు. జాండ్రపేట అనే పేరు ముందు నుంచీ ఉందని వృద్ధులు చెబుతున్నారు. పంచాయతీ, ఇతర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలపైనా దేవాంగపురి అనే పేరు కన్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన పోస్టాఫీసు, రైల్వేస్టేషన్ బోర్డులపై జాండ్రపేట అని ఉంది. స్థానికులకు, ఈ ప్రాంతాల వారికి జాండ్రపేట, దేవాంగపురి ఒక్కటేనని బాగా తెలుసు. కొత్తగా వచ్చినవారు కొన్ని సందర్భాల్లో ఒకింత గందరగోళానికి గురవుతుంటారు. అయితే పాలనాపరంగానూ, ఇతర ఏ విషయంలో కూడా రెండు పేర్లు వల్ల ఇబ్బంది లేదని గ్రామస్థులు చెప్తున్నారు.

విద్యతోనే అన్నివిధాలా అభివృద్ధి

- మహిళా కళాశాల ఆడిటోరియం ప్రారంభంలో మంత్రి స్వామి
- ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల హాజరు


హాజరైన ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల, ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థినులు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే అన్ని విధాలుగా అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో రూ.9.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ కళావేదికను మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలకు అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు, పాకెట్ మనీని డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. కాలేజీలో చదువుకుంటున్న విద్యార్థుల కోసం పక్కనే ఉన్న హాస్టల్ భవనంపై రూ.5 కోట్లతో మరో రెండస్థులు నిర్మిస్తామని మంత్రి స్వామి పేర్కొన్నారు. ఒంగోలులోని అన్ని హాస్టళ్లలో రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతామని, మహిళా కళాశాలకు అవసరమైన అన్ని వసతులూ కల్పిస్తామని ఆయన చెప్పారు. అనంతరం ఎంపీ మాగుంట మాట్లాడుతూ కాలేజీకి అవసరమైన కంప్యూటర్లను తాను ఇప్పటికే సమకూర్చానని, న్యాక్ గుర్తింపు లభించడం కోసం కూడా కృషి చేశానని గుర్తుచేశారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ కాలేజీకి అవసరమైన అదనపు గదులు, ఇతర వసతులు సమకూర్చామని ఆయన చెప్పారు. బైపాస్ నుంచి నేరుగా కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించేలా ప్రత్యేక రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని దామచర్ల వెల్లడించారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపాల్ కళ్యాణి అకడమిక్ ప్రోగ్రెస్‌ను వివరించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు పారితోషికాలను అందించారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు భాస్కర బాబు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్‌లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో, జానపద వేషధారణలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా కళాశాల ప్రగతిని తెలియజేసేవిధంగా విద్యార్థినులు ప్రదర్శించిన రూపకం సైతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ఇందిర, డాక్టర్ ఎం.మంజుల భారతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా

జిల్లా అభివృద్ధికి చర్యలు

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్



ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధికి అవసరమైన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి జిల్లా అన్ని విధాలుగా ముందుడుగు వేసేలా చర్యలు తీసుకుంటామని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ఇరవై సూత్రాల అమలు కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని పలు అంశాలపై చర్చించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలవారు కూడా అభివృద్ధి సాధించేలా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటికి అవసరమైన మ్యాచింగ్ గ్రాంట్స్ విడుదల చేసి, అభివృద్ధిని వేగవంతం చేస్తున్నట్లు ఆయన వివరించారు. జిల్లాలో లఖ్‌పతి దీదీ పథకం విజయవంతంగా అమలు అవుతుందన్నారు. సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా సూర్యఘర్ పథకాన్ని జిల్లాలో 5 లక్షల ఇళ్లకు విస్తరించేలా దృష్టి సారించాలని తెలిపారు. ఒంగోలులో అదనపు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, కనిగిరి నిమ్జ్, దొనకొండ ఇండస్ట్రియల్ ఏరియా, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు

కోర్టు పనులను వేగవంతం చేయాలి

హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ మన్మథరావు

సింగరాయకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలో జరుగుతున్న తాత్కాలిక అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు నిర్మాణ పనులను హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ కుంభజడల మన్మథరావు శనివారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి, కందుకూరు కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.శోభారాణి, ఇన్‌చార్జి అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి భరత్‌చంద్ర, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు ఉన్నారు.


బీమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

బీమాతో రైతుకు ధీమా

- రబీలో ఆరు పంటలకు వర్తింపు
- రుణాలు పొందిన వారికి నేరుగా బ్యాంకు నుంచే ప్రీమియం చెల్లింపు
- ప్రచార పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం అండగా నిలవనుంది. గ్రామం, మండలం, జిల్లా యూనిట్‌గా ఒక్కోరకం పంటకు ఒక్కో విధంగా నష్టాన్ని పరిగణనలోకి తీసుకొని బీమా అందించనున్నారు. జిల్లాలో ఈ పథకాన్ని ప్రభుత్వం ఐసీఐసీఐ లంబార్డ్ కంపెనీ ద్వారా అమలు చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో వరి, కంది, మిర్చి, సజ్జ, మినుము, నువ్వు పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పించింది. జిల్లాలో సుమారు 2.85 లక్షల ఎకరాల్లో ఆ పంటలకు సంబంధించి ప్రీమియం చెల్లింపు జరిగింది. ప్రస్తుత రబీ సీజన్‌లో మరో 6 రకాల పంటలకు బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ప్రధానమైన శనగ పంటకు గ్రామం యూనిట్‌గా తీసుకుంటున్నారు. వరి, జొన్న, మినుము, ఎర్ర మిరప పంటలకు మండలం యూనిట్‌గా, మొక్కజొన్న పంటకు జిల్లా యూనిట్‌గా నిర్ణయించారు. బీమా మొత్తంలో శనగ పంటకు 1.15 శాతం, వరి, మినుము, మిర్చిలకు 0.50 శాతం, జొన్న, మొక్కజొన్నకు 0.30 శాతం రైతు తన వాటా ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. బ్యాంకు నుంచి రుణాలు పొందిన వారికి ఆ రుణ మొత్తాల నుంచి ప్రీమియాన్ని బ్యాంకులు నేరుగా బీమా కంపెనీకి చెల్లించనున్నాయి. రుణాలు పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, సచివాలయాలు, పీఏసీఎస్‌లలో చెల్లించవచ్చు. ప్రీమియం చెల్లించే ప్రతి రైతు విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

బ్యాంకు ఖాతాలకు బీమా సొమ్ము జమ

రైతులు ఇచ్చే బ్యాంకు అకౌంటు నంబర్‌కు నేరుగా వారికి వచ్చే బీమా మొత్తాన్ని కంపెనీ జమ చేస్తుంది. నష్ట పరిహారాన్ని గత ఏడేళ్లలో లభించిన సగటు దిగుబడిని, ప్రస్తుతం పంట కోత ప్రయోగాల ద్వారా ఇచ్చిన దిగుబడిని పరిగణలోకి తీసుకొని ఇవ్వనుంది. అదే వాతావరణ ఆధారిత పంటల విషయంలో వాతావరణ అంశాల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేస్తారు.

ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

జిల్లాలో ప్రస్తుతం రబీ సాగు జోరందుకుంది. వ్యవసాయ శాఖ అధికారులు వివిధ రూపాల్లో బీమా ప్రయోజనాలు, ప్రీమియం చెల్లింపు గురించి ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఒంగోలులో జరిగిన దిశ సమావేశంలో బీమా ప్రచార పోస్టర్‌లను మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏవో) సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేకించి అనావృష్టి, అతివృష్టి వంటి ప్రకృతి విపత్తులు అధికంగా ఉండే మన జిల్లా రైతులకు ఇది వరమన్నారు. రైతులంతా సకాలంలో ప్రీమియం చెల్లించాలని ఆయన సూచించారు. రబీలో బీమా వర్తింపు చేస్తున్న ఆరు పంటల్లో ఒక్క వరికి మాత్రం డిసెంబర్ 31 వరకు గడువు ఉందన్నారు. మిగిలిన ఐదు రకాల పంటలకు సంబంధించి ప్రీమియాన్ని ఈనెల 15వ తేదీలోపు చెల్లించాలని కోరారు.

అత్యధిక పింఛన్ ఇస్తున్న ప్రభుత్వం మాదే

● మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

కొండపి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అత్యధిక పింఛన్ అందిస్తున్నది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమేనని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం మండలంలోని నెన్నూరుపాడులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు పింఛన్‌ను రూ.4వేలకి పెంచారన్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందే పెన్షన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వరుసగా రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా తరువాతి నెలలో మూడు నెలలు కలిపి ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. జిల్లాలో మొత్తం 2,86,034మందికి రూ.122 కోట్ల 22 లక్షల పెన్షన్ నగదును ఇస్తున్నట్లు మంత్రి స్వామి వివరించారు. నెన్నూరుపాడు గ్రామంలో 241 మంది లబ్ధిదారులకు రూ.10.20 లక్షలు పింఛన్ సొమ్మును అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీడీ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, టీడీపీ నాయకుడు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



దివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న మంత్రి స్వామి



మారెళ్లగుంటవారిపాలెంలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

టంగుటూరులో..

టంగుటూరు: మండలంలో మొత్తం 9,344 పెన్షన్లు ఉండగా శనివారం సాయంత్రం 5గంటలకు 8,599 మందికి పంపిణీ జరిగింది. మిగిలిన పెన్షన్లు సోమ, మంగళ వారాల్లో పంపిణీ చేస్తారు. శ్రీనివాసనగర్, సౌత్ బీసీ కాలనీలాంటి ప్రాంతాల్లో నూరు శాతం పంపిణీ పూర్తి కాగా మిగిలిన ప్రాంతాల్లో ముగింపునకు వచ్చాయి.

అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే బీఎన్

మద్దిపాడు: అర్హులైన వారందరికీ సామాజిక భద్రత పింఛన్లు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మారెళ్లగుంటవారిపాలెంలో ఆయన పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. అనంతరం బీఎన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లవంటివని చెప్పారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు రూ.5 లక్షలు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతున్నదని చెప్పారు. కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, నల్లూరి శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు నల్లూరి రామచంద్రయ్య, సర్పంచ్ కాకి శైలజ, వీఆర్వో పాతిమాబేగం, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: లబ్ధిదారులకు పలువురు టీడీపీ నాయకులు శనివారం పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట తప్పకుండా పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు.

సురక్షితంగా బాలుడు అప్పగింత

● నిందితులు కరుడుగట్టిన నేరస్థులు

చీమకుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అరకులో కిడ్నాప్‌కు గురై శుక్రవారం రాత్రి చీమకుర్తిలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న బాలుడిని శనివారం సీఐ సుబ్బారావు అతడి తల్లిదండ్రులు, అరకు పోలీసులకు క్షేమంగా అప్పగించారు. కాగా బాలుడిని కిడ్నాప్ చేసిన ముగ్గురు వ్యక్తులు యాసిన్, సంతోష్, అమీర్‌లు పలు కేసుల్లో ఇప్పటికే ముద్దాయిలుగా ఉన్నారు. వారిలో ఇద్దరు ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చారు. కరడుగట్టిన నేరస్థులుగా పోలీస్ రికార్డుల్లో ఉన్న ఈ ముగ్గురు గంజాయి అక్రమ రవాణా, హైవేపై దోపిడీలపాటు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. తాజాగా జరిగిన కిడ్నాప్‌పై అరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. పారిపోయిన ముద్దాయిల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీస్ చట్టం

ఒంగోలు(క్రైం) నవంబరు30(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం నుంచి 30 పోలీస్ చట్టం అమలు చేస్తున్నట్లు ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1నుంచి 31వ తేదీ వరకు ఈ చట్టం అమలులో ఉంటుందన్నారు. పోలీసు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ఊరేగింపులు చేయకూడదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

జీసీటీఏ జిల్లా నూతన కమిటీ



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) జిల్లా నూతన కమిటీ శనివారం ఒంగోలులో ఎన్నికైంది. డాక్టర్ శ్రీహరి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా, ఎన్నికల పరిశీలకులుగా ఎస్.తిరుపతిస్వామి వ్యవహరించారు. కాగా నూతన కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.గురుశేఖర్, కార్యదర్శిగా కె.రవీంద్ర, మహిళా సెక్రటరీగా మంజులభారతి, కోశాధికారిగా శ్రీకాంత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

పోలీస్‌శాఖలో బదిలీల పర్వం

● 195 మందికి కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం) నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పోలీసు కళ్యాణ మండపంలో పోలీస్‌శాఖలోని సిబ్బందికి శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ 195 మందికి కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు సీఐలు రాఘవేంద్ర, దేవ ప్రభాకర్, సూర్యనారాయణ, ఏవో రామ్మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కల్చరల్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డి 29వ వర్ధంతి కార్యక్రమాలు ఆదివారం స్థానిక పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట రాఘవరెడ్డి, నిఖిల్‌రెడ్డి, నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు మైదానాన్ని పరిశీలించి ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు.

మైనంపాడులో కళాశాల బస్సు అడ్డగింత

● ఆందోళనకారులకు సర్దిచెప్పిన ఎస్ఐ

సంతనూతలపాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి గురైన బాధిత వ్యక్తి కుటుంబసభ్యులు ఒంగోలుకు చెందిన ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల బస్సును అడ్డుకున్న సంఘటన శనివారం ఉదయం మైనంపాడులో జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు, మైనంపాడుకు చెందిన ఖాశీంవలి నాలుగు రోజుల క్రితం రామతీర్థం వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల బస్సు ఢీకొంది. ఈప్రమాదంలో ఖాశీంవలి గాయపడగా మెరుగైన చికిత్సకోసం మంగళగిరిలోని ఎయిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగానే ఉందని తెలిపారు. ఈక్రమంలో కళాశాల బస్సు విద్యార్థుల కోసం మైనంపాడుకు రావడంతో బాధితుడి కుటుంబసభ్యులు అడ్డుకుని న్యాయం చేయాలని నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అజయ్‌బాబు వారికి సర్ది చెప్పి బస్సును పంపించారు.

14న క్రిస్మస్ పాటలకు డాన్స్ పోటీలు

ఒంగోలు(కల్చరల్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా ఒంగోలు కళానిలయం ఆధ్వర్యంలో క్రిస్మస్ పాటల గ్రూప్ డాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను స్థానిక సెయింట్ థెరిస్సా చర్చి ఆవరణంలో ఫాదర్ డీఎస్.పాల్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ 14వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల క్రైస్తవ యువతీ, యువకులు, క్రైస్తవ సంఘాలు, చర్చి యూత్ సభ్యులు పాల్గొనాలని కోరారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, కన్సోలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9440925092, 9963201398 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కేరళ హైస్కూల్ కరస్పాండెంట్ సీటీ.మైఖేల్, వేలూరి శ్రీనివాసరావు, సొల్యూషన్ సిస్టర్స్ స్వర్ణ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజం, లెనినిజం ప్రజలకు అవసరం

ఒంగోలు(కల్చరల్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో మార్క్సిజం, లెనినిజం ప్రజలకు ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్.శర్మ పేర్కొన్నారు. ఈనెల 13,4,15 తేదీల్లో జరుగనున్న సెమినార్ గురించి శనివారం ఒంగోలులో సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగుతున్నాయని చెప్పారు. జీవీ.కొండారెడ్డి, ఎస్‌కే.మాబు, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో సాగునీటి వ్యవస్థలు నిర్వీర్యం

● ఎమ్మెల్యే దామచర్ల



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ విమర్శించారు. శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవనంలో సాగు నీటి సంఘాల ఎన్నికలపై కూటమి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో సరైన కేటాయింపులు లేక తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని చెప్పారు. సాగునీటి సంఘాల రద్దు అంటే రైతులు లేని వ్యవసాయం లాంటిదన్నారు. సాగునీటి వ్యవస్థకు పునరజ్జీవం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పించారని, ఆ మేరకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుపుతున్నారని పేర్కొన్నారు. అందరూ కష్టపడి అన్ని చోట్ల కూటమి అభ్యర్థుల విజయం సాధించాలని తెలిపారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి పనుల పరిశీలన

స్థానిక అగ్రహారం రైల్వే గేటు వద్ద జరుగుతున్న అండర్ పాస్ బ్రిడ్జి పనులను మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం పోతురాజుపాలెం, ఎన్.అగ్రహారం, బాలాజీనగర్, బత్తులవానికుంట, చినమల్లేశ్వర కాలనీ తదితర ప్రాంతాల ప్రజల చిరకాల కోరిక అన్నారు. పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని వారు సూచించారు.

అశోక్‌బాబు ఆరోపణలు అవాస్తవం

● ఎంపీపీ అంకమ్మరెడ్డి వెల్లడి



పత్రాలను చూపిస్తున్న అంకమ్మరెడ్డి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ యాదల అశోక్‌బాబు తనపై, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్‌రెడ్డిపై చేసిన ఆరోపణలు అవాస్తవమని చిన్నగంజాం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి తెలిపారు. శనివారం ఒంగోలులోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదల అశోక్‌బాబుకు తనకు మధ్య వ్యాపార సంబంధమైన లావాదేవీలు తప్ప మరేమీ లేవన్నారు. అశోక్‌బాబు, తాను కలిసి రూ.25లక్షలతో ఇసుక భూమి కొన్నామని తెలిపారు. దాని తాలూకు ఆయన రూ.18 లక్షలు ఇచ్చారని చెప్పారు. కొన్ని రోజుల తర్వాత తిరిగి డబ్బులు ఇవ్వాలని కోరడంతో రూ.10లక్షలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తమ మధ్య అగ్రిమెంట్ కాగితాలు ఉన్నాయన్నారు. అయితే అశోక్‌బాబు వద్ద ఎమ్మెల్యే టికెట్ ప్రస్తావన, రాజకీయ అంశాలపై ఎలాంటి సంభాషణ జరగలేదని ఆయన తెలిపారు. అందులో ప్రణీత్‌రెడ్డికి ఎమ్మెల్యే టికెట్‌కు డబ్బులు ఇచ్చినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం దుర్మార్గమన్నారు. దీనిని తాను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా ఆర్థిక లావాదేవీలు ఉంటే ఇద్దరం కూర్చుని చర్చించుకొని పరిష్కరించుకోవాలే తప్ప ఇలా తప్పుడు కేసులు పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా పెట్టిన కేసు, చేసిన ఆరోపణలు వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో పరువు నష్టం దావా వేస్తానని అంకమ్మరెడ్డి హెచ్చరించారు.

నేడు యాదవుల వనభోజన మహోత్సవం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యాదవ కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం ఉదయం 10గంటలకు కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్‌లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శనివారం ఒంగోలు నగరం రామనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కార్తీక మాసం పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, టీటీడీ పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ వేడుకలలో యాదవులు కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నిర్వాహకులు రాచగర్ల వెంకట్రావు, కొఠారి నాగేశ్వరరావు, కొఠారి శ్రీనివాసులు, యోగయ్య యాదవ్, గోళ్ళ వెంకటేశ్వరరావు, బొడ్డు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: కార్తీకమాస సమారాధన కరపత్రాలను సంతనూతలపాడులో శనివారం యాదవ సంఘం నాయకులు అడకా స్వాములు, నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం కొత్తపట్నంలోని నల్లూరిగార్డెన్‌లో జరిగే జిల్లా కార్తీకమాస సమారాధనకు మండలంలోని యాదవులు అందరూ హాజరుకావాలని, సంతనూతలపాడు బస్టాండ్‌లో ఉదయం 9గంటలకు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. కార్యక్రమంలో సురేష్, నలగట్ల సుబ్బారావు, శంకర్, నరసింహారావు, సాయి, తెల్లమేకల శ్రీనివాసరావు, గాలి సుబ్బారావు, పెరుగు సుబ్బారావు పాల్గొన్నారు.

పేస్ విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థినిని అభినందిస్తున్న యాజమాన్యం

ఒంగోలు(విద్య), నవంబరు 30: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి పి.అబ్రహం నిక్సన్ జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల బాక్సింగ్ పోటీలలో 62 కేజీల విభాగంలో ప్రథమ స్థానాన్ని సాధించి బంగారుపతకం కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా సీఎస్ఈ రీజనల్ విభాగానికి చెందిన ఎం.కావ్య వెయిట్‌లిఫ్టింగ్ 55 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కళాశాలలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ సీవీ.సుబ్బారావు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆర్.వీరాంజనేయులు, రూపాకేష్, విభాగాధిపతులు సుధీర్‌చక్రవర్తి, గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

సింగరాయకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా ముగిసింది. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు అధికశాతం డుమ్మాకొట్టారు. స్థానిక మండల కాంప్లెక్స్‌లోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం మందిరంలో శనివారం మండల సమావేశం జరిగింది. పది గ్రామాల సర్పంచ్‌లలో కేవలం శానంపూడి సర్పంచ్ బ్రహ్మయ్య మాత్రమే హాజరయ్యారు. దీంతో మండల సమావేశం నామమాత్రంగా ముగిసింది. బింగినపల్లి ఎంపీటీసీ సామంతుల రవికుమార్‌రెడ్డి తమ గ్రామంలో సైడుకాలువలలో పూడికతీత తీయించాలని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కట్టా శోభారాణి, ఏవో కృష్ణారావు, డీటీ ముస్తాక్ పాల్గొన్నారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు

సంతనూతలపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని శ్రీఅంకాళమ్మతల్లి ఆలయంలో మాసశివరాత్రి వేడుకలను శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు అర్చకులు ఉప్పుటూరిరామయ్య ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలి : సీపీఎం

ఒంగోలు(క్రైం) నవంబరు30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలు నగరం గుంటూరురోడ్డులోని డీ3 విద్యుత్ కార్యాలయం వద్ద స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలోని వాణిజ్య సంస్థలకు యజమానుల అనుమతి లేకుండానే స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని, దీనిని అందరూ వ్యతిరేకించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణల్లో భాగంగా గత ప్రభుత్వం అంగీకారం మేరకు స్మార్ట్ మీటర్లు విధానం అమలు చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో కూటమి ఈ విధానాన్ని వ్యతిరేకించిందని, అయితే కూటమి ప్రభుత్వం అమలు చేయడం తగదన్నారు. ప్రీపెయిడ్ ఫోన్ రీచార్జ్‌లాగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వల్ల కరెంటు ఎప్పుడు పోతుందో తెలియదని చెప్పారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలను అమలు చేయడం ఏమేరకు సబబు అన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు తంబి శ్రీనివాసరావు, ఎండీ.కరీమ్, షేక్ గౌస్‌బాషా, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి పూజలు



పూజల్లో పాల్గొన్న స్వాములు, హరిబాబు తదితరులు

సంతనూతలపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు హైస్కూల్ సమీపంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ప్రాంగణంలో కమిటీ నాయకుల ఆధ్వర్యంలో కార్తీమాస సమారాధన పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, ఎంపీడీవో సురేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబు, ముప్పరాజు శ్రీను, మందాడి శ్రీను, సదానందరావు, సీహెచ్.శ్రీను, ఎం.రామారావు, టి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రానైట్ వాహనాల సీజ్

చీమకుర్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామతీర్థం పరిసరప్రాంతాల్లో ఉన్న గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల నుంచి అనుమతిపత్రాలు లేకుండా గ్రానైట్ రవాణా వాహనాలను మైన్స్ అధికారులు శనివారం సీజ్ చేశారు. ముడిరాళ్లను, శ్లాబులను బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తుండగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రెండు వాహనాలను పట్టుకున్నారు.

డీఐపీఆర్వో గ్రేస్‌లినోరా ఉద్యోగ విరమణ



గ్రేస్‌లినోరాను సన్మానిస్తున్న సిబ్బంది

ఒంగోలు(కల్చరల్), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్న కె.గ్రేస్‌లినోరా శనివారం ఉద్యోగ విరమణ చేశారు. శాఖలో ఆమె 40 సంవత్సరాల ఏడు నెలలకు పైగా పనిచేశారు. గుంటూరు జిల్లాలో పలు హోదాలలో పనిచేసిన ఆమె 2019లో ప్రకాశం జిల్లాకు బదిలీపై వచ్చారు. క్రమశిక్షణ, చిత్తశుద్ధి గల అధికారిగా పేరుతెచ్చుకున్న ఆమె ముఖ్యమంత్రి మొదలు జిల్లా కలెక్టర్ వరకు పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆమె ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక ప్రకాశంభవనంలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు సభలో కార్యాలయ స్సిబంది గ్రేస్‌లినోరాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూతన డీఐపీఆర్వో పి.వేణుగోపాల్‌రెడ్డి, డీపీఆర్వో రమేష్, డివిజనల్ పీఆర్వో దుర్గాప్రసాద్, ఇ.రమణమూర్తి, సమాచార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డవరప్పాడులో టీడీపీ సభ్యత్వ నమోదు



కాలనీల పర్యటిస్తున్న నాయకులు

మద్దిపాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దొడ్డవరప్పాడులో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక దళితకాలనీలో పలువురికి సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముల్లూరి మురళి, గోరంట్ల వెంకటేష్, బొమ్మల నాగేశ్వరరావు, ఇమ్మానియేల్, బొమ్మల కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి

సంతనూతలపాడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్.వేములపాడు సచివాలయానికి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని శనివారం గ్రామ టీడీపీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీను డిమాండ్ చేశారు. గత కొన్నాళ్లగా రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో సచివాలయంలో సమస్యలు పేరుకుపోయాయని చెప్పారు. తాగునీటి సమస్య, ఇతర పనుల పరిష్కారానికి అధికారులు స్పందించి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని ఆయన కోరారు.

జాతీయస్థాయిలో ఏకేయూ విద్యార్థి ప్రతిభ



ప్రేమ్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు(విద్య), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌లో ఇటీవల జరిగిన రెండో అఖిల భారత పెంకాక్ సిల్కాట్ చాంపియన్స్-2024 పోటీలలో స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ విద్యార్థి కె.ప్రేమ్‌కుమార్ రజత పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా స్థానిక యూనివర్సిటీలో శనివారం వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబులు ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా క్రీడలకు పుట్టినిల్లని, నూతనంగా ఏర్పడిన తమ యూనివర్సిటీ విద్యార్థి దేశస్థాయిలో రజత పతకం పొందటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డీడీ ఐ.దేవీవరప్రసాద్, ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, అధ్యాపకులు అడపాల వెంకటేశ్వర్లు, నారాయణ పాల్గొన్నారు. ప్రేమ్‌కుమార్ ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు వారు తెలిపారు.

ఛాయాచిత్ర యోధునికి నివాళి



అన్నదానం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 30, (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని ప్రముఖ ఫోటోగ్రాఫర్ వెంకటరమణ స్టూడియో అధినేత గ్రంధే కోటేశ్వరరావుకు ఫోటోగ్రాఫర్‌లు ఘన నివాళి అర్పించారు. స్థానిక వెంకటరమణ స్టూడియో వద్ద ఆయన సంస్మరణ సభ ఏర్పాటు చేసి పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫోటో, వీడియో గ్రాఫర్ల నాయకులు బొంత వెంకటేశ్వర్లు గౌడ్, ఓబయ్య, డి.చరణ్‌కుమార్‌బాబీ, కాశీం, జిలానీ, రమేష్, శివారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, మల్లి, శివ, వాసు, భద్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు కామేశ్వరరావు



కామేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఈఈ నాగేశ్వరరావు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా త్యజించిన కార్మికరత్న ఎస్ఏఎన్ కామేశ్వరరావు ఆదర్శనీయుడని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ పీవీవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఏఎన్ కామేశ్వరరావు 51వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటితరం కామేశ్వరరావు క్రమశిక్షణ, కార్యదక్షత, నిబద్ధత తదితర అంశాలు తెలుసుకుని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీయా నాయక్, శేషగిరిరావు, పలువురు విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ



పంచాయతీ కార్యాలయంలో విచారిస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం మేజర్ పంచాయితీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డిని త్రిసభ్య కమిటీ విచారించింది. ఆర్థిక సంఘం, సాధారణ నిధులు దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్‌కు ఇటీవల పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ తమీమ్ అన్సారీయా అదేశాల మేరకు ఉన్నతాధికారులు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, మార్కపురం డీఎల్‌పీవో భాగ్యవతి, ఆడిట్ విభాగం అధికారి రమేష్‌లు శనివారం ఈ ఆరోపణలపై విచారించారు. రెండు సంవత్సరాల రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో మాట్లాడి వివరాలను రికార్డు చేశారు. పరిశీలించిన ప్రతి అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు విచారణ అధికారులు తెలిపారు.

హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దదోర్నాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దా మని ప్రభుత్వ డిగ్రీ కళా శాల ప్రిన్సిపాల్ ఎస్. సావిత్రీ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్బంగా శనివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత క్షణికావేశానికి లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాల న్నారు. ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, రక్త మార్పిడి ద్వారా వ్యాపిస్తుందన్నారు. నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది విజయబాబు, జయసింహా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షరాఫ్ బజారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. తొలత ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, టింబర్ డిపో శ్రీను, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డు పనుల ప్రారంభం

పెద్దదోర్నాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలోని పాత శివాలయం వీధిలో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు టీడీపీ నాయకులు షేక్ మంజూర్ భాష శనివారం ప్రారంభించారు. రూ.15లక్షలు నిధులతో రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పింఛన్లపై మాట నిలుపుకున్న చంద్రబాబు

- టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు
- ఒక్కరోజు ముందుగానే పంపిణీ

త్రిపురాంతకం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ పెంచుతామని ఎన్నికల ముందు చెప్పిన ప్రకారం మాట నిలబెట్టుకుని పెరిగిన పెన్షన్‌ను లబ్ధిదారులకు అందించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడికి దక్కుతుందని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని కొత్త ముడివేముల గ్రామంలో డిసెంబరు నెలకు సంబంధించిన పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పెన్షన్ కోసం ఎదురు చూసేవారని ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో తొలిరోజే ఇంచుమించు నూరుశాతం లక్ష్యాలను పూర్తి చేస్తున్నారన్నారు. కొత్తపెన్షన్ల కోసం డిసెంబరు నెలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. పేదలందరికీ పక్కా గృహాలను మంజూరు చేస్తామన్నారు. ముడివేములకు ప్రధాన సమస్యగా ఉన్న రోడ్లు, మౌలిక వసతులతో పాటు ఇక్కడి రైతాంగానికి అవసరమైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను కూడా మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన కోసం మంత్రి లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమార్, టీడీపీ నాయకులు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, అళ్ళ నాసరరెడ్డి, కె.కొండలు, వి.ఆంజనేయులు, జి.వెంకటనారాయణ, ఎం.పిచ్చయ్య, ఆర్.సుధాకర్, జనసేన నాయకుడు మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో ఒక రోజు ముందే పించన్లు పంపిణీ పూర్తి చేసింది. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో పెన్షన్ నగదు ఒకరోజు ముందే శనివారం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని రాయవరం గ్రామంలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లో ఒకరోజు ముందుగానే రాష్ట్రప్రభుత్వం ఫించన్లు పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఒంగోలు పార్లమెంటు ముస్లిం మైనారిటీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి అత్తార్ షేక్ హుస్సేన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫించన్‌దారుల విషయం లో గొప్ప నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. పించన్ వస్తూ భర్త మరణిస్తే మరుసటి నెలలో భార్యకు పింఛన్ వచ్చేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఒక నెల ఫించన్ తీసుకోకపోతే మూడు నెలల లోపు ఎప్పుడైనా ఫించన్ తీసుకోవచ్చన్నారు. కంభం మండలంలో శనివారం 95 శాతం ఫించన్లు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు మంచి చదువులు కావాలి

జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం మంచి చదువులు చదివి రాణించాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో వాచ్‌ఉమన్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి చొరబడితే పరిస్థితి ఏమిటని ఆలస్యంగా వచ్చిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. బాలికల వసతిగృహం కావడంతో జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. తనిఖీ సమయంలో 70 మంది విద్యార్థినులు అక్కడ ఉన్నారు. ఈ సందర్భంగా పిల్లలతో న్యాయాధికారి మాట్లాడుతూ, క్రమశిక్షణతో చదువుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను, వసతులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలన్నారు. విద్యార్థినులకు అందుతున్న ఆహారం, వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో తనిఖీ వచ్చిన సందర్భంగా రోడ్డు మీదకు వంగి పోయిన రెండు కొబ్బరి చెట్లను సంబంధిత అధి కారులు తొలగించడంపై అభినందించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయాధికారి ఓంకార్

సబ్ జైలు తనిఖీ

పట్టణంలోని క్లబ్ రోడ్డులోని సబ్‌జైలును జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హతలను విచారణలో ఉన్న ఖైదీలకు వివరించారు. బెయిల్ కోసం అర్జీలను పెట్టుకోవచ్చని, సంబంధిత కోర్టులో తెలియజేయాలన్నారు. సబ్ జైలు ఆవరణను, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్ ఉన్నారు.

విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలి

మార్కాపురం సీఐ సుబ్బారావు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని మార్కాపురం సీఐ సుబ్బారావు అన్నారు. స్థానిక రాక్‌వెల్ పాఠశాలలో వార్షిక ఆర్ట్ ఎక్స్ పో-2024ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాత్మకతను ప్రదర్శించే వివిధ కళలు, చిత్రాలు, శిల్పాలు, చేతిపని పనులు ప్రదర్శించారు. కార్య క్రమంలో రూరల్ ఎస్ఐ అంకమరావు, రాక్‌వెల్ పాఠశాల డైరెక్టర్ వెన్నా నాగార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, ఆర్ట్ టీచర్ కిషోర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాల్‌త్రో చేస్తున్న సీఐ సుబ్బారావు



ప్రదర్శన తిలకిస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

సెలవుపై తహసీల్దార్

ధ్రువపత్రాల కోసం విద్యార్థుల అవస్థలు

పుల్లలచెరువు,నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో కీలకమైన రెవెన్యూ శాఖలో తహసీల్దార్ లేకపోవడంతో పాలన గడితప్పింది. ప్రత్యామ్నాయం కూడా చూపకపోవడంతో ఆరు రోజులుగా విద్యార్థులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. అధికారుల అలసత్వంతో కీలకమైన రెవెన్యూ శాఖ అధికారి లేక ఆరు రోజులుగా విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుల్లలచెరువు మండలంలో పనిచేసే తహసీల్దార్ నయీం అహ్మద్ ఈ నెల 25న అనారోగ్యంతో సెలవు పెట్టాడు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారి లేకపోవడంతో విద్యార్థులు, రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్పులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఇన్‌కం, క్యాస్టు, ఈబీసీ సర్టిఫికెట్స్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆరు రోజులుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. డిజిటల్‌సైన్ లేకపోవడంతో విద్యార్థులు ధ్రువపత్రాలు లేక కళాశాలలు మానుకొని ఇంటికి తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి వెంటనే ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం

ఆరు రోజులుగా తిరుగుతున్నాను

నా కుమార్తె గుంటూరులో చదువుతోంది. క్యాస్టు సర్టిఫికెట్స్ కోసం పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నాను. తహసీల్దార్ రాకపోవడంతో ధ్రువపత్రాల కోసం ఇంటి వద్దనే ఉంది.

వెంకటేశ్వర్లు, విద్యార్థిని తండ్రి, కుందంపల్లి

విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

కంభం సీఐ మల్లికార్జునరావు

కంభం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని కంభం సీఐ మల్లికార్జునరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలలో నూతన పోకడలు, గంజాయి, డ్రగ్స్ వినియోగం, మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు, బాల్య వివాహాలు, రోడ్డుప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ఆకర్షణలకు లోనుకాకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమయస్ఫూర్తితో సక్సెస్ సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మాల్యాద్రి, సీఆర్‌పీ, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : విద్యార్థులు భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ఎదగాలని, జన విజ్ఞాన వేదిక జిల్లా ఆరోగ్య కన్వీనర్ డాక్టర్ శరత్ అన్నారు. స్థానిక సాయిచైతన్య హైస్కూల్‌లో చెకుముకి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు లహరి, వైష్ణవి, నాగశ్రీలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, జేవీవీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు, బహుమతులు పొందిన విద్యార్థులు

నేడు యాదవుల వనభోజన మహోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): యాదవ కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం ఉదయం 10గంటలకు కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్‌లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. శనివారం ఒంగోలు నగరం రామనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కార్తీక మాసం పురస్కరించుకుని నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, టీటీడీ పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథులు గా హాజరవుతారని తెలిపారు. ఈ వేడుకలలో యాదవులు కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నిర్వాహకులు రాచగర్ల వెంకట్రావు, కొరారి నాగేశ్వరరావు, కొతారి శ్రీనివాసులు, యోగయ్య యాదవ్, గోళ్ళ వెంకటేశ్వరరావు, బొడ్డు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: కార్తీకమాస సమారాధన కరపత్రాలను సంతనూతలపాడులో శనివారం యాదవ సంఘం నాయకులు అడకా స్వాములు, నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం కొత్తపట్నంలోని నల్లూరిగార్డెన్‌లో జరిగే జిల్లా కార్తీకస మాస సమారాధనకు మండలంలోని యాదవులు అందరూ హాజరుకావాలని, సంతనూతలపాడు బస్టాండ్‌లో ఉదయం 9 గంటలకు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. కార్యక్రమంలో సురేష్, నలగట్ల సుబ్బారావు, శంకర్, నరసింహారావు, సాయి, తెల్ల మేకల శ్రీనివాసరావు, గాలి సుబ్బారావు, పెరుగు సుబ్బారావు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

త్రిపురాంతకం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన దుప్పట్లు, కార్పెట్లను ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వసతి గృహాల్లో సమస్యలన్నింటినీ సాంఘిక సంక్షేమశాఖామంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. హాస్టల్ ప్రాంగణంతోపాటు విద్యార్థులూ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం మార్కాపురం ఏఎస్‌డబ్ల్యూవో ఎస్.అరుణకుమారి ఆధ్వర్యంలో వసతిగృహం సమస్యలపై వినతిపత్రాన్ని ఎరిక్షన్‌బాబుకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఏవో నీరజ, ఎంఈవో రాజశేఖరరెడ్డి, వార్డెన్ డి.శ్రీను, టీడీపీ నాయకులు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.కొండలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిమజ్జనం

గిద్దలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస పూజల్లో భాగంగా నెల రోజులుగా పూజలు నిర్వహించిన గంగమ్మ, గౌరమ్మలకు డిసెంబరు 1న ఆదివారం ఉదయం 10 గంటలకు నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అమ్మవారిశాల కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు అమ్మవారిశాల నుంచి గంగమ్మ, గౌరమ్మలను కే.ఎస్.పల్లె సమీపంలోని సగిలేరునది వద్దకు తీసుకుని వెళ్లి అందులో నిమజ్జనం చేసి అనంతరం భీమలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు నిమజ్జన, వనభోజనాల కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి విద్యార్థికి చదువే ఆయుధం



మేజిక్ చేస్తున్న కాటూరి నాగేశ్వరరావు

పెద్దదోర్నాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థికి చదువే ఆయుధ మని జాతీయ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంటూరి రంగారావు అన్నారు. మండలంలోని చిన్న దోర్నాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం సైన్స్‌పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాటూరి నాగేశ్వరరావు పలు వస్తువులతో మేజిక్ చేశారు. సైన్స్ పరిజ్ఞానంతో కొన్ని వస్తువుల రసాయనిక చర్యల వల్ల ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చూపించవచ్చన్నారు. మూఢ నమ్మకాలను నమ్మొద్దని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

3న టీడీపీ శ్రేణులతో సమావేశం

గిద్దలూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల రోడ్డులోని శ్రీలక్ష్మీ డైరీ మిల్క్ ఆవరణలో డిసెంబరు 3న మంగళవారం బేస్తవారపేట మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆ మేరకు స్థానిక టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. తప్పక హాజరుకావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తపాలా కార్యలయంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకో వాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎస్‌పీ జి.శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలో నూతన తపాల కార్యాలయం ప్రారంభోత్స కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓపీఆర్ఎస్ మహామ్మద్ జఫార్ సాధ్విక్, స్థానిక పోస్టు మాస్టర్ కిషోర్, ఐపీవో నాగరాజు, ఎంపీపీ దొంత కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ సభ్యుడు చేదూరి విజయభాస్కర్, గ్రామ సర్పంచ్ అరుణబాయ్, నాయకులు, తపాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదని టీడీపీ ఆరోపణలు..

స్థానిక తపాల కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యురాలైన కాయకాకుల సత్యావతికి ఆహ్వానం లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రొటోకాల్ మీద మాట్లాడే ఎమ్మెల్యేకు ఈ విషయం తెలియదా..? అని ప్రశ్నించారు. అలాగే మార్కెట్ యార్డు చైర్మన్ శింగారెడ్డి నాగమణి అయితే అమె స్థానంలో ఆమె భర్త ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్ట్

ఎర్రగొండపాలెంరూరల్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న జెఈ డి.హరిబాబు పట్ల అనుచితంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన ఎర్రగొండపాలేకి చెందిన (విద్యుత్ కాంట్రాక్టర్) ఎం.సుబ్బారెడ్డిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సుబ్బారెడ్డి స్వగ్రామం పుల్లలచెరువు మండలం మల్లాపాలెం కాగా, అయన ప్రస్తుతం ఎర్రగొండపాలెంలో ఉంటున్నారు. ఆయనపై జూలై 30న పోలీసు స్టేషన్‌లో ఏఈ ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం సుబ్బారెడ్డిని అరెస్టు చేశారు. మార్కాపురం కోర్టులో హాజరు పరచగా ఆయనకు కోర్టు బెయిల్ ఇచ్చింది. ఆ మేరకు వివరాలను సీఐ సీహెచ్. ప్రభాకరరావు వివరాలు వెల్లడించారు.

మహిళపై యువకుడి దాడి

మార్కాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళపై యువకుడు దాడిచేసిన ఘటన పట్టణంలోని ఒంటెద్దుబండి కాలనీలో చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై సైదుబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన ఓ మహిళ భర్తకు విడాకులు ఇచ్చి ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన యువకుడితో కొన్నాళ్లు సన్నిహితంగా ఉంది. అయితే ఆరు నెలలుగా వీరు దూరంగా ఉంటున్నారు. బ్యాంకు పనిమీద సదరు మహిళ కంభం రోడ్డులోని యూనియన్ బ్యాంకు వద్ద ఉండగా అక్కడకు వచ్చిన యువకుడు ఆమెతో గొడవపెట్టుకున్నాడు. ఆమెపై భౌతికంగా దాడి చేసి గాయపరిచాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇన్‌చార్జ్ డాక్టర్లే దిక్కు

» అవస్థలు పడుతున్న పశుపోషకులు
» పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర, మారెళ్ల పశువైద్యశాలలకు ఇన్‌చార్జ్ డాక్టర్లే దిక్కయ్యారు. కొన్ని సంవత్సరాల నుంచి ఇన్‌చార్జ్‌లే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సకాలంలో వైద్యసేవలు అందక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన జిల్లా పశు వైద్యశాఖాధికారులు ఆవైపు కూడా కన్నెత్తి కూడా చూడటం లేదు. మండలంలోని ఈదర పశువైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ పేరయ్య చీమకుర్తి పరిధిలోని పశు వైద్యశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దాదాపు ఐదు సంవత్సరాల నుంచి ఇన్‌చార్జ్‌తోనే ఈదర పశువైద్యశాల నడుస్తోంది. ఈ పశువైద్యశాల పరిధిలో పూరిమెట్ల, భీమవరం, బొప్పూడివారిపాలెం, కొమ్మవరం, అయోధ్యనగర్, పూరిమెట్ల గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పశువులు ఏదైనా వ్యాధిబారిన పడితే ప్రైవేట్ పశువైద్యులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.


తాళం వేసిఉన్న ఈదర పశువైద్యశాల

ఈదర పశువైద్యశాలకు ఇన్‌చార్జ్‌గా తూర్పుగంగవరం పశువైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ రాంబాబు కొనసాగుతున్నారు. మారెళ్ళ పశువైద్యాధికారి కాశిరెడ్డి సెలవులో ఉండటంతో ముండ్లమూరు పశువైద్యాధికారిణి ఎం.విజయలక్ష్మి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఒకే వైద్యశాలలో ఎక్కువ గ్రామాలు ఉండటంతో సక్రమంగా వైద్యం అందించలేకపోతున్నారు.

ముండ్లమూరు మండలంలో 37 వేల పశువులు ఉన్నాయి. ఇతర జీవులు, కోళ్ళు కూడా దాదాపు పది వేలకు పైగానే ఉన్నాయి. మండలంలో ఎక్కువగా డెయిరీలతోపాటు కోళ్ళ ఫారాలు ఉన్నాయి. పశువైద్యుల కొరతతో సకాలంలో సేవలు అందడం లేదు. ప్రస్తుతం ఇద్దరే ఉండటంతో భారంగా మారింది.

ఇప్పటికైనా జిల్లా పశువైద్యశాఖ అధికారులు స్పందించి రెగ్యులర్ పశువైద్యాధికారులను నియమించి తమ ఇబ్బందులను తొలగించాలని పశుపోషకులు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి పట్టణంలోని 18వ వార్డులో శనివారం మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి ఆమె పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఒకవైపు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, మరోవైపు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఆదివారం సెలవు కావటంతో అవ్వా, తాతలు ఎదురుచూడకూడదనే ఉద్దేశంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం ఏనాడు సకాలంలో పింఛన్లు, జీతాలు ఇచ్చిన పాపాన పోలేదని డాక్టర్ లక్ష్మి విమర్శించారు. ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తుండటంతో అవ్వా తాతల కళ్లల్లో ఆనందం చూస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.15 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు వరుసగా అమలవుతుండటంతో అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆమె వివరించారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని చందలూరు పీహెచ్‌సీని ఆమె సందర్శించారు. అక్కడ ప్రజలకు వైద్యం అందుతున్న తీరును తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలకు అవసరమైన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పిస్తామని చెప్పారు. ఏమైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బ్లెస్సీ, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనన పత్రానికి పాట్లు

» తహసీల్దార్ కార్యాలయం చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు
» నెలలు గడుస్తున్నా అందని వైనం

వెలిగండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆధార్ కార్డులో జనన తేదీని సరిచేయడానికి రెవెన్యూ శాఖ జారీ చేసే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధ్రువీకరణ పత్రం ఎలా పొందాలో అవగాహన లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ విద్యార్థులు తిరుగుతూ అవస్థలు పడుతున్నారు.

ఆధార్‌లో పుట్టిన తేదీ తప్పుగా ఉంటే మార్చుకునేందుకు పదో తరగతి పూర్తయిన విద్యార్థుల మార్కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చినా చెల్లదని, 18 ఏళ్లలోపు పుట్టిన తేదీ మార్చుకోవాలంటే తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం కావాలని ఆధార్ కేంద్రంలో అధికారులు చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు పనులు మానుకుని ఆధార్ కేంద్రాలు, సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో 4255 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 1100 మందికి పైగా ఆధార్‌లో ఉన్న వివరాలు సరిగా లేవు. దీంతో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ విద్యార్థులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బందిని జనన ధ్రువీకరణ పత్రం గురించి అడిగితే పొంతన లేకుండా సమాధానం చెప్పడమే కాకుండా మాపై మండిపడుతున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలా చేసుకోవాలి..

2012 ముందు జన్మించిన వారు తహసీల్దార్ వద్ద, 2012 తరువాత జన్మించిన వారు పంచాయతీ కార్యదర్శి వద్ద ముందుగా నాన్ అవైలబిటీ సర్టిఫికెట్ తీసుకోవాలి. అనంతరం సచివాలయాల్లో జనన ధ్రువీకరణ పత్రం కోసం నిర్దేశిత నగదు చెల్లించి అప్లై చేయాలి. గుర్తింపు పొందిన న్యాయవాదితో అఫిడవిట్ తీసుకోవాలి. రూ.50 చలానా చెల్లించాలి. సంబంధిత పత్రాలన్నీ వీఆర్‌వోకు అందజేయాలి. ఆయన పరిశీలించిన తర్వాత రెవెన్యూ అధికారి అనుమతి పొందిన తరువాత స్థానిక సచివాలయానికి వెళ్లి జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి.


వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయం

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కేవీపల్లి విద్యార్థుల ఎంపిక

కనిగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన కంచర్లవారిపల్లి హైస్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ కాశివిశ్వనాధరెడ్డి శనివారం తెలిపారు. నవంబరు 23 నుంచి 25 వరకు పల్నాడు జిల్లా కారంపూడిలో అండర్ 14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి గోపవరపు సాయిసందీప్, బాలికల విభాగం నుంచి మండాది వర్షిణి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు డిసెంబరులో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భూపాల్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఖోఖో చీఫ్ పాట్రన్, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, సంఘ అధ్యక్షుడు కె.హనుమంతరావు, బి.కాశీవిశ్వనాధరెడ్డి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి హాజీరాబేగం, హెచ్‌సీహెచ్ విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


సాయిసందీప్


వర్షిణి

అవ్వా తాతల కళ్లలో ఆనందం

» ముందురోజే పింఛన్‌ల పంపిణీ

కనిగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెల్లారకముందే అవ్వా తాతల కళ్ళలో ఆనందం నిండింది. వైసీపీ ప్రభుత్వంలో పింఛన్ పంపిణీ సెలవువస్తే ఆ తర్వాతనే పంపిణీ చేపట్టారు. ఒక్కో నెలల్లో నెల దాటినా పింఛన్‌లు అందక అవ్వా తాతలు అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఒకటో తారీఖున ఆదివారం రావటంతో ముందురోజే పింఛన్‌లు పంపిణీ చేపట్టారు. తెలుగు తమ్ముళ్లు, తెలుగుమహిళలు తెల్లారకముందే 5గంటలకే సచివాలయం సిబ్బందితో పింఛన్‌లు అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆదేశాలతో కనిగిరి మండలంలోని మున్సిపాల్టీ పరిధిలోని 20 వార్డుల్లో, మండలంలోని 25గ్రామ పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కాగా, కనిగిరి మండలంలోని 25 పంచాయతీల్లో 6589 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారిలో 6129మందికి మొదటిరోజే అందజేశారు. అలాగే, మున్సిపాలిటీ పరిధిలో 4259 మంది లబ్ధిదారుల్లో 3999 మందికి అందజేశారు. శనివారం రాత్రికి 10128 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బందితో పాటు తెలుగు తమ్ముళ్ళు, తెలుగుమహిళలు పంపిణీ చేశారు.

98శాతం పంపిణీ

ముండ్లమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పింఛన్‌లు పంపిణీ చేశారు. శంకరాపురంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు లబ్ధిదారులకు పింఛన్‌ల నగదు పంపిణీ చేశారు. మండలంలో 7,091 మందికి పింఛన్‌లు పంపిణీ చేయాల్సి ఉండగా 98 శాతం తొలిరోజునే పంపిణీ చేశారు.

పామూరులో..

పామూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసినట్టు ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. అందుబాటులోలేని లబ్ధిదారులకు సోమవారం అందజేస్తామని తెలిపారు. అర్హత కలిగి 60 సంవత్సరాలు నిండిన వారికి నూతనంగా పింఛన్ల మంజూరుకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం త్వరలో చేపడుతున్నట్టు చెప్పారు. సంక్రాంతికి కొత్త పింఛన్లు లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాల్లో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


కనిగిరి: వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న తెలుగుమహిళ

పెరిగిన పొగనారు ధర

కురిచేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పొగనారు ధరలు అమాంతం పెరిగాయి. దీంతోపాటు కూలీల రేట్లు కూడా పెరగంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వెయ్యి మొక్కలు రూ.350 ఉండగా నేడు రూ.వెయ్యికి చేరింది. పొగనాట్లు వేసే కూలీలకు సైతం రేటు ఎక్కువగా ఉంది. మెట్టపంటలో కూలీ రేటు రూ.400 ఉంది. అయితే, పొగ నాట్లకు కూలీ రేటు రూ.600కు పైగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు పొగాకు పంట తడిసి ఆకులమీద జిడ్డు కారిపోవంతో ఆకులతో నాణ్యత తగ్గుతుంది. పెరిగిన నారు ధర, కూలీల రేటు మరింత నష్టాలకు గురి చేస్తుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రజా సంక్షేమానికి పెద్దపీట

తాళ్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం పండుగ వాతావరణంలా జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబును పెద్దన్నగా, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను చిన్నన్నగా ప్రజలు భావిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తాళ్లూరులో టీడీపీ యువనాయకుడు ఐ.శ్రీనివాసరెడ్డి పింఛన్‌ల పంపిణీలో పాల్గొన్నారు. మండలంలో 6203 పెన్షన్‌దారులు ఉండగా మొదటిరోజు 5795 మందికి అందజేసినట్టు ఎంపీడీవో కె.సుందరరామయ్య తెలిపారు.

ముఖాముఖి

'ఉపాధి'లో కనీస కూలి రూ.300

బి.మాల్యాద్రి, ఏపీవో, పామూరు



ప్రశ్న: ఉపాధి కూలీలకు కూలీ గిట్టుబాటు కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి?
జవాబు: ప్రభుత్వం నిర్దేశించిన కనీస కూలి రూ.300 నిర్ణయించారు. కొలతల ప్రకారం పనిచేస్తే ఆమేర పడుతుంది.
ప్ర: ఉపాధిలో ఏ పనులు నిర్వహిసున్నారు.
జ: పారంపండ్, హార్టీకల్చర్, పొలం చుట్టూ కందకాలు, ఫీడల్ ఛానెల్ లాంటి పనులు జరుగుతున్నాయి.
ప్ర: మండలంలో ఎన్ని జాబు కార్డులు ఉన్నాయి?
జ: మండలంలో సుమారు 11 వేలు జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో 9 వేల జాబు కార్డుదారులు పనులకు వస్తున్నారు.
ప్ర: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయా?
జ: వ్యవసాయ పనులు జరుగుతుండటంతో కూలీల సంఖ్య తగ్గింది. ప్రస్తుతం పది పంచాయతీల్లో మాత్రమే పనులు జరుగుతున్నాయి.
ప్ర: మండలంలో ఎన్ని గోగులం షెడ్లు మంజూరయ్యాయి.?
జ: 23 పంచాయతీల్లో మంజూరయ్యాయి. డిసెంబరు 30నాటికి పూర్తి చేయాలని డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా సమావేశాలు

పామూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచటంతో పాటు సుహృద్భావ వాతావరణం కల్పించేందుకు విద్యాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంఈవోలు తెలిపారు. విద్యాభివృద్ధిలో అందరిని భాగస్వాములు చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో డిసెంబరు 7న సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో డీవీ సుబ్బారావు తెలిపారు.

మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణం పేరుతో అక్రమంగా మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి ఎం .రత్నారెడ్డి కోరారు. ఈమేరకు శనివారం మండలంలోని రామాపురం గ్రామస్థులు డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం రామాపురం గ్రామ తారురోడ్డు పక్కనే మట్టి తవ్వకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో గాదంశెట్టి లక్ష్మీనరసయ్య, జయరాములు, జి.గురవయ్య, కె.వెంకటసుబ్బయ్య, బాలకేశవులు, వెంకటాద్రి పాల్గొన్నారు.

సత్తా చాటిన వ్యవసాయ కళాశాల విద్యార్థి



మునయ్యకు కప్ అందజేస్తున్న శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని కదిరిబాబురావు వ్యవసాయ కళశాల కు చెందిన మునయ్య అనే విద్యార్థి షాట్ పుట్‌లో ప్రథమస్థానం సాధించాడు. శ్రీకాకుళం జిల్లాలోని నైరా వ్యవసాయ కళాశాలలో జరిగిన అంతర కళాశాలల క్రీడా పోటీలలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మూడవ సంవత్సరం చదువుతున్న మునయ్య షాట్‌పుట్‌లో సత్తాచాటి మొదటి స్థానం సాధించాడు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో మునయ్యకు ఆజిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ట్రోఫిని అందజేశారు. కార్యక్రమంలో నైరా వ్యవసాయ కళాశాల డీన్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ పిచ్చయ్య, పాల్గొన్న సభ్యులు

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలి

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పంచాయతీలోని అన్నిప్రాంతాల్లో నూరుశాతం సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేస్తామన్నారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు ఇంటింటికి కొళాయి పథకాన్ని అమల్లోకి తెస్తామన్నారు. అమృత పథకం అమలుకు సమావేశం ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


జమ్మలమడకలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

ముండ్లమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదేపల్లి, రజానగరం మేజర్ల పరిధిలో 17 సాగునీటి సంఘాలకు డిసెంబరు 8న ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో శనివారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలవరం, మారెళ్ళ, జమ్మలమడక, ఉమామహేశ్వర అగ్రహారం, ఈదర, నాయుడుపాలెం, ముండ్లమూరు, పెద ఉల్లగల్లు, పులిపాడులలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, వీఆర్‌వోలు వేణుగోపాలరెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో అలక్ష్యం

వెలిగండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమానికి సంబంధించిన అధికారులు గ్రామాల్లో పర్యటించి పక్కాగా నమోదు చేయాలి. వెలిగండ్ల మండలంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతుందని ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ వివరాలు నమోదు చేయాలి. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళితే పంచాయతీ కార్యదర్శులు చాటింపు వేయించి సర్వే నాటికి గ్రామాలకు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. అయితే, అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణలోపంతో కొంతమంది సిబ్బంది గృహాలను సందర్శించకుండా సచివాలయంలో కూర్చొని సర్వే పూర్తి చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వెలిగండ్ల ఎస్సీ కాలనీవాసులు తమ ఇళ్లకు ఏ అధికారి రాకుండానే సర్వే చేశారని తెలియడంతో మరొక అధికారి దగ్గరికి వెళ్లామని తెలిపారు. సదరు అధికారి మైగ్రేషన్ కింద నమోదు చేశారని, దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు అనర్హులవుతామోనని ఆందోళన చెందుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ మురళి

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను ప్రజలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ ఎం.మురళి సూచించారు. దర్శిలోని చైతన్య పాఠశాలలో శనివారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అతివేగంతో వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై ఎంతో విలువైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొనకొండ అభివృద్ధిపై దృష్టి సారించాలి

దొనకొండ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అన్నిరంగాల్లో ఎంతో వెనుకబడిన దొనకొండ మండలం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ మాగుంట శ్రీనువాసులురెడ్డిని టీడీపీ నాయకులు కోరారు. ఆపార్టీ మండల నాయకులు శృంగారపు నాగసుబ్బారెడ్డి, మోడి పెద్దఅంజనేయులు, తదితరులు శనివారం ఎంపీ మాగుంటను ఒంగోలులోని ఆయన నివాసంలో కలిశారు. ప్రధానంగా మండలంలోని పలుగ్రామాల్లో మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ట్యాంకర్లు ఏర్పాటుచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఉపాధి అవకాశాలు లేక ఎంతోమంది ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వంతో చర్చించి దొనకొండ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డిని గజమాలతో సన్మానించారు.

గ్రంథాలయ శాశ్వత భవన నిర్మాణానికి కృషి

తాళ్లూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు శాఖా గ్రంథాలయానికి శాశ్వత నిర్మాణం కోసం నిధులు మంజూరుకు తమ వంతుకృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఆదిలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గ్రంథాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు వి.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య కార్యవర్గం

తాళ్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండల మహిళా సమాఖ్య నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సుభాషిణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మారాబత్తు సుజాత, ఉపాధ్యక్షురాలిగా పులిపాటి లీల, కార్యదర్శిగా షేకిబీబీజాన్, సహాయకార్యదర్శిగా పాలెం ధనలక్ష్మి, కోశాధికారిగా ఎస్.భాగ్యలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ మండలంలో పొదుపు మహిళల అభ్యున్నతికి తనవంతు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దర్శి ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి, దర్శి నియోజకవర్గ స్త్రీనిధి మేనేజర్ పవన్ కల్యాణ్, ఏపీఎం దేవరాజ్, సీసీలు సుచింద్ర, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వృథాగా గ్రానైట్ రాళ్లు


బల్లికురవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్రమ మార్గంలో తరలిస్తున్న గ్రానైట్ స్లాబులు, ముడిరాయిని మైనింగ్ విజిలెన్స్ అధికారులు పట్టుకొని ఏళ్లు గడుస్తున్నాయి. ఆ కేసు విచారణ ముందుకు కదలకపోవడంతో లక్షల విలువచేసే రాళ్లు పోలీసు స్టేషన్ సమీపంలో వృథాగా పడిఉన్నాయి. బల్లికురవ పోలీసు స్టేషన్ వద్ద గత నాలుగేళ్ల నుంచి గ్రానైట్ స్లాబులు, ముడిరాళ్ల ఉన్నాయి. అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ రాళ్లను గతంలో అధికారులు పట్టుకొని లారీలను వదిలి పెట్టి అందులో ఉన్న రాళ్లను స్టేషన్ వద్ద అన్‌లోడ్ చేశారు. ఈ రాళ్ల కేసు నేటికీ విచారణకు వచ్చిన దాఖలాలు లేవు. పోలీసు స్టేషన్ వద్ద ఖాళీ లేకపోవడంతో పట్టుబడిన రాళ్లను రైతుల స్థలాల్లో పడేశారు. ఏళ్ల నుంచి మా స్థలంలో ఉంచిన రాళ్లు తీసుకెళ్లకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు.





కొల్లూరు మండలం దోనేపూడి వద్ద నేలవాలిన వరిపైరు

వర్షం.. కష్టం

- 1 పలు చోట్ల నేలవాలిన వరి
- 1 రైతులను వెంటాడుతోన్న ఫెంగల్
- 1 తుఫాన్ ప్రభావంతో అన్నదాతల్లో ఆందోళన
- 1 మొలకలు వచ్చే అవకాశం ఉండడంపై అన్నదాతల ఆవేదన


కొల్లిపర మండలం చివలూరులో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు


నిజాంపట్నం హార్బర్‌లో 3వనెంబర్ ప్రమాదసూచిక ఎగురవేత


కొల్లూరు : ధాన్యంపై కప్పిన పట్టాలపై నిలిచిన వర్షపు నీరు

బాపట్ల, కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు , నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అననుకూల పరిస్థితులను అధిగమించారు. భారీ వర్షాలు.. వరదలను ఎదిరించారు. తెగుళ్లను తట్టుకున్నారు. పంట చేతికి వచ్చేసింది. ఇక కోతలే అనుకుంటున్న తరుణంలో ఫెంగస్ తుఫాన్ రైతన్నల వెన్నులో వణుకుపుట్టిస్తోంది. పంట కొత్తకు వచ్చిన సమయంలో వరుణుడు దోబూచులాడుతుండడంతో అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం చిరు జల్లులకే పరిమితమైన వాన శనివారం రేపల్లె, బాపట్ల, వేమూరు ప్రాంతాల్లో ఓ మోస్తరుగా కురిసింది. దీంతో వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గతంలో వచ్చిన ప్రకృతి విపత్తులతో ఇప్పటికే కుదేలై ఉన్న సమయంలో అరకొరగా చేతికొచ్చే పంట కూడా దక్కకుండా పోతుందేమోనన్న బెంగ రైతులను వెంటాడుతున్నది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు దాదాపు 30,000 ఎకరాల్లో నేలవాలింది. వర్షాలు ఎక్కువైతే పంటంతా తుడిచిపెట్టుకు పోవడం ఖాయంగా ఉంది. ఇప్పటికే కోసిన ధాన్యాన్ని వర్షం భయంతో బస్తాల్లోకి ఎత్తి ఉంచారు. రెండు రోజుల క్రితం యంత్రాలతో కోత కోయగా వచ్చిన దాన్యాన్ని రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసుకుని ప్లాస్టిక్ పట్టాలతో భద్రపరుచుకున్నప్పటికీ వర్షానికి చెమ్మ చేరింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 8,000 ఎకరాల్లో కోతలు పూర్తి కాగా ఇందులో 6,000 వరకు వేమూరు నియోజకవర్గ పరిధిలోనే ఉంది. ఈ కోతలకు సంబంధించి 600 టన్నుల వరకు ధాన్యమే కొనుగోలు కేంద్రాలకు చేరగా, 2,000 టన్నుల వరకు రైతులు భద్రపరుచుకున్నట్టు వ్యవసాయశాఖ గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. వాన భయంతో నష్టానికి అన్నదాతలు బహిరంగ మార్కెట్‌లో దాదాపు 2,000 టన్నుల ధాన్యం విక్రయించుకున్నట్లు సమాచారం.

హార్బర్‌లో మూడో నెంబర్ ప్రమాద సూచిక

రేపల్లె: తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంది. ఫెంగల తుఫాన్ కారణంగా శనివారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద సూచికను ఎగురవేశారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని వెళ్ళిన వారు ఒడ్డుకు చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. వేటకు వెళ్లిన బోట్లలో ఇప్పటికే 90 శాతం హార్బర్‌కు చేరుకున్నాయి.


కొల్లిపర మండలం చివలూరు సమీపంలో వరికుప్పకు పట్టాలు కప్పుతున్నరైతులు

వర్షాలు ఎక్కువైతే ఇబ్బందే..

కొల్లిపర మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాలతో పాటు తీర ప్రాంత గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి దఫదఫాలుగా కురిసిన వర్షానికి, గాలులకు నిలువు మీద ఉన్న వరి పైరు నేలవాలింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 2.40 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా ఇందులో 80 శాతం వరకు వరిపైరు కోతకు సిద్ధంగా ఉంది. వేమూరు, రేపల్లెతో పాటు బాపట్ల నియోజకవర్గ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో వారం క్రితమే కోతలు మొదలయ్యాయి. తుఫాన్ హెచ్చరికలతో మరింతమంది కోతలు చేపట్టారు. పంట కోసిన వారి వెతలు ఒకవిధంగా ఉంటే పొలంమీద ఉన్న పైరు నేలవాలి రైతులను మరింత కలవరపెడుతోంది. నేలవాలిన పైరు ఎక్కువ రోజులు కోయకుండా ఉంటే మొలకెత్తడంతో పాటు ధాన్యం రంగుమారుతుందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. శనివారం కురిసిన ఓ మాస్తరు వర్షంతో తుఫాన్ ప్రమాదం తప్పితే స్వల్ప నష్టంతో రైతులు బయటపడే అవకాశం ఉంది. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు నమోదైతే మాత్రం అన్నదాతలు కోలుకోలేని విధంగా నష్ట పోవడం ఖాయం. ఎకరాకు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు పెట్టుబడి పెట్టామని వర్షం భారీగా పడితే పంటంతా నీటిపాలయ్యే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.


కొల్లిపర మండలం అత్తోటలో వర్షానికి తడిచిన వరి ఓదెలు

ప్రజాభిప్రాయంతోనే..

- అమరావతి ప్రతి నిర్మాణంలోనూ ప్రజా భాగస్వామ్యం
- సీఆర్‌డీఏ కార్యాలయ నమూనాలపై ప్రజాభిప్రాయ సేకరణ
- పది డిజైన్లను వెబ్‌సైట్‌లో ఉంచి ఓటింగ్ కోరిన సీఆర్‌డీఏ
- మెజారిటీ ఓటింగ్ ప్రకారమే ప్రాజెక్టు ఆఫీసు నమూనా ఎంపిక





అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో తలపెట్టే ప్రతి పనికీ ప్రజలను భాగస్వామ్యం చేయాలన్న దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధానిలో చేపట్టే ఏ పనైనా, ప్రాజెక్టు నిర్మాణాలైనా ప్రజల ఆకాంక్షలు, సూచనల మేరకు ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వ అభిమతంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సీఆర్‌డీఏ అధికారులు అమల్లోకి తీసుకువచ్చారు. రాజధానిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ డిజైన్స్ ఎలా ఉండాలన్న దానిపై సీఆర్‌డీఏ ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టింది. ముందుగా తమ సొంత ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ డిజైన్లు ఎలా ఉండాలన్న దానిపై ప్రజాభిప్రాయ సేకరణ తలపెట్టింది. సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసుకు సంబంధించి రూపొందించిన మొత్తం 10 డిజైన్లను సీఆర్‌డీఏ అధికారులు తమ వెబ్‌సైట్‌లో పెట్టారు. ఈ పది డిజైన్లలో ఏది నచ్చిందో ఓటు వేసే పోల్ ఆప్షన్ ఇచ్చారు. వరుస క్రమంలో పది నమూనాలు ఉంటాయి. ఈ నమూనాలను జూమ్ చేసుకుని చూసే సదుపాయాన్ని కూడా కల్పించారు. నచ్చిన డిజైన్‌ను ఎంచుకోవాలి. డిజైన్‌ను ఎంచుకున్న తర్వాత పేరు, విద్యార్హతలు, ఫోన్ నెంబర్, రివ్యూ కోరుతూ ఒక పాపఅప్ వస్తుంది. అవన్నీ పూర్తి చేసిన తర్వాత సబ్‌మిట్ చేయాలి. శనివారం మధ్యాహ్నం దీనిని అధికారికంగా వెబ్‌సైట్‌లో ఉంచారు. దీనిపై ఇంకా ప్రచారం కూడా చేపట్టకపోయినా.. సాయంత్రం 5 గంటలకి 438 మంది ఓటింగ్ వేశారు. ఆదివారం నుంచి సీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసు డిజైన్లకు ఓటింగ్ శాతం భారీగా పెరిగే అవకాశం ఉంది. ఈ పది డిజైన్లలో దేనికి మెజారిటీ ఓటింగ్ వస్తుందో ఆ డిజైన్‌నే సీఆర్‌డీఏ అధికారులు ఎంపిక చేస్తారు.

పింఛన్లు.. చకచకా

- 1 సర్వర్ స్పీడుతో 96 శాతానికి పైగానే
- 1 వేకువజామున 6 గంటలకు ప్రారంభం


చుండూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వంలో సామాజిక పింఛన్లను ఠంచన్‌గా పంపిణీ చేస్తున్నది. డిసెంబరు నెలకు సంబంధించి పింఛన్లను ఒక రోజు ముందుగానే శనివారం పంపిణీ జరిగింది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవుదినం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తెలవారుతుండగానే లబ్ధిదారుడి ఇంటి తలుపుతట్టి మరీ నగదును సచివాలయ సిబ్బంది అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 5 గంటలకు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఆ సమయంలో సర్వర్ స్పీడ్‌గా రెస్పాన్స్ కావడంతో చకాచకా పంపిణీని చేపట్టారు. సచివాలయ, ఇతర ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో భాగస్వామలయ్యారు. ఒక్క రోజులోనే 95 శాతం పంపిణీ జరిగింది. జిల్లావ్యాప్తంగా కూటమి పార్టీల శ్రేణులు కూడా పంపిణీలో భాగస్వాములయ్యారు. ఒక్క రోజు ముందే పింఛన్ పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. గడచిన రెండు, మూడు నెలలుగా పింఛన్ తీసుకోని వారిని కూడా గుర్తించిన దాదాపు 800 మందికి కూడా ఇంటింటికి వెళ్లి పాత బకాయిలు కూడా అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై మూడో నెలలకు ఒకసారి కూడా మొత్తం పింఛన్‌ని తీసుకోవచ్చని సచివాలయాల సెక్రెటరీలు తెలిపారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా టంచన్‌గా ప్రతీ నెలా ఒకటో తేదీ, ఒకవేళ ఆ రోజు సెలవు అయితే ముందురోజే పింఛన్ పంపిణీ చేస్తుండటంపై పెన్షనర్లు ఆనందోత్సాహాలు వ్యక్తపరుస్తు న్నారు. గతంలో ఒకటో తేదీ సెలవు వస్తే తర్వాత తేదీకి వాయిదా వేసేవారని, దాంతో అనేక ఇబ్బందులు పడేవారమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పింఛన్ అందుకుంటున్న వారి సంఖ్య 2,28,615 మంది ఉండగా, వీరిలో 95 శాతం మందికి పింఛన్‌ను శనివారమే అందించారు. మిగిలిన వారు అందుబాటులో లేకపోవడం వల్లే పెండింగ్ ఉన్నట్లు అధికారులు చెప్పారు.

ఐఆర్‌ఈఎఫ్ కళాశాల బస్సు దగ్ధం

- బస్సులో 30 మంది విద్యార్థులు
- డ్రైవర్ అప్రమత్తతతో క్షేమం
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు

రేపల్లె-చెరుకుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): షార్టు సర్క్యూట్ కారణంగా ఐఆర్‌ఈఎఫ్ కళాశాలకు చెందిన నర్సింగ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సు చెరుకుపల్లిమండలం గూడవల్లి వద్ద దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తమై బస్సులో ఉన్న 30 మంది విద్యార్థులను సురక్షితంగా బయటకు దింపారు. రేపల్లె పట్టణంలోని 19వ వార్డులోని ఐఆర్‌ఈఎఫ్ (ఇండియన్ రూరల్ ఇవాంజికల్ ఫెలోషిప్)కు చెందిన కళాశాల బస్సు శనివారం ఉదయం నర్సింగ్ విద్యార్థులకు రాత పరీక్షల నిమిత్తం గుంటూరుకు బస్సులో బయలుదేరారు. ఈ బస్సులో 30 మంది విద్యార్థినులు ఉన్నారు. గూడవల్లి సమీపంలోకి వచ్చేసరికి బస్సులో పొగలు కమ్మేయ్యటంతో డ్రైవర్ మేరుగశ్యామ్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపి విద్యార్థులను కిందకు దింపారు. బస్సులో ఒక్కసారిగా శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. స్థానికులు గోగినేని కృష్ణ, రావిపాటి సీతారామయ్య మరికొందరు స్థానికులతో కలసి బస్సులో మంటలను ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఇంతలో రేపల్లె నుంచి ఫైర్ ఇంజన్ రావటంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా

విద్యార్థినుల ఆందోళనపై త్రిసభ్య కమిటీ

- తక్షణం స్పందించిన ప్రభుత్వం.. విచారణకు ఆదేశాలు
- నేటి మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ విచారణ
- వర్సిటీ వసతి గృహ హెడ్‌కుక్, కుక్‌ల సస్పెన్షన్

పెదకాకాని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భోజనంలో పురుగులు, కప్పలు, జర్రెలు వస్తున్నాయని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విద్యార్థినులు శుక్రవారం రాత్రి చేపట్టిన ఆందోళనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సీఎం ఆదేశాలతో ఉన్నత విద్యా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు శనివారం వర్సిటీలో పర్యటించారు. విద్యార్థినుల వసతిగృహం, మెస్ గదులు, భోజనశాలలను కూడా ఆయన తనిఖీ చేశారు. వర్సిటీలోని ఉదంతంపై తక్షణమే విచారణ చేపట్టాలని త్రిసభ్య కమిటీని శనివారం నియమించింది. వాస్తవాలను విచారించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కమిటీలోని అధికారులు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, గుంటూరు డీఎస్‌వో పద్మజ, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి రవీందర్‌రెడ్డి శనివారం వర్సిటీలో పర్యటించారు. తొలుత వీసీ చాంబర్‌లో గంగాధరరావుతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థినుల వసతి గృహాలకు వెళ్లి భోజనశాల, వంటగదులు, మరుగుదొడ్లను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులు వారి సమస్యలను అధికారులకు తెలిపారు. భోజనం అపరిశుభ్రంగా ఉంటుందని, రుచి, సుచి లేకుండా ఉండటం వల్ల తినలేక పోతున్నామని చెప్పారు. వసతి గృహాల నిర్వహణ సరిగా లేదని, పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని ఫిర్యాదు చేశారు. పిల్లులు ముట్టిన పాలు, పెరుగును వడ్డిస్తున్నారని తెలిపారు. నాణ్యతలేని ఆహార పదార్థాలు, కల్తీ నూనెలు, నాసిరకం సరుకులు వంటకు వాడుతున్నారన్నారు. వర్సిటీలో విద్యార్థినుల ఇబ్బందులు, వారి సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు విద్యార్థినుల వసతి గృహంలోని రీడింగ్ రూమ్‌లో విచారణ చేపట్టనున్నట్లు విచారణ అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా విలేకరులకు తెలిపారు.

సిబ్బందిపై వేటుతో సరి

వర్సిటీలోని మెస్‌లో తయారు చేసే భోజనంలో పురుగులు రావడం, వంట అశుభ్రంగా ఉండటంపై స్పందించిన వర్సిటీ అధికారులు విద్యార్థినుల వసతి గృహ హెడ్ కుక్, కుక్‌లను సస్పెండ్ చేశారు. చీఫ్ వార్డెన్ వెంకటరత్నంపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం ఏమిటని వర్సిటీ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి.



పోలీసు స్టేషన్ ఆవరణలో పడి ఉన్న గ్రానైట్ స్లాబులు

వృథాగా గ్రానైట్ రాళ్లు

» అక్రమ రవాణాలో పట్టుబడి

పోలీస్ స్టేషన్ ముందు పడి ఉన్న పలకలు

» ఏళ్లుగా విచారణకు నోచుకోని కేసు



రోడ్డు మార్జిన్‌లో పడవేసి ఉన్న గ్రానైట్ ముడిరాయి

బల్లికురవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మార్గంలో తరలిస్తున్న గ్రానైట్ స్లాబులు, ముడిరాయిని మైనింగ్ విజిలెన్స్ అధికారులు పట్టుకొని ఏళ్లు గడుస్తున్నాయి. ఆ కేసు విచారణ ముందుకు కదలకపోవడంతో లక్షల విలువ చేసే రాళ్లు పోలీసు స్టేషన్ సమీపంలో వృథాగా పడిఉన్నాయి. బల్లికురవ పోలీసు స్టేషన్ వద్ద గత నాలుగేళ్ల నుంచి గ్రానైట్ స్లాబులు, ముడిరాళ్లు ఉన్నాయి. అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ రాళ్లను గతంలో అధికారులు పట్టుకొని లారీలను వదిలి పెట్టి అందులో ఉన్న రాళ్లను స్టేషన్ వద్ద అన్‌లోడ్ చేశారు. ఈ రాళ్ల కేసు నేటికీ విచారణకు వచ్చిన దాఖలాలు లేవు. పోలీసు స్టేషన్ వద్ద ఖాళీ లేకపోవడంతో పట్టుబడిన రాళ్లను రైతుల స్థలాల్లో పడేశారు. ఏళ్ల నుంచి మా స్థలంలో ఉంచిన రాళ్లు తీసుకెళ్లకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోతున్నారు. పోలీసు స్టేషన్ వద్దకు వచ్చే ప్రజలు కూడా ఈ రాళ్లు చూసి కొంతకాలానికి ఇవి పనికిరాకుండా పోతాయని అంటున్నారు. అధికారులు ఆ రాళ్లను వేలం ద్వారా అమ్మితే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని ప్రజలు కోరుతున్నారు.

5న మండల సర్వసభ్య సమావేశం

సంతమాగులూరు : మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఈ నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు సాధారణ మండల సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

జనన పత్రానికి పాట్లు

» తహసీల్దార్ కార్యాలయం చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణలు

» నెలలు గడుస్తున్నా అందని వైనం



వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయం

వెలిగండ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆధార్ కార్డులో జనన తేదీని సరిచేయడానికి రెవెన్యూ శాఖ జారీ చేసే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధ్రువీకరణ పత్రం ఎలా పొందాలో అవగాహన లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ విద్యార్థులు తిరుగుతూ అవస్థలు పడుతున్నారు.

ఆధార్‌లో పుట్టిన తేదీ తప్పుగా ఉంటే మార్పుకు నేందుకు పదో తరగతి పూర్తయిన విద్యార్థుల మార్కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చినా చెల్లదని, 18 ఏళ్ల లోపు పుట్టిన తేదీ మార్చుకోవాలంటే తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం కావాలని ఆధార్ కేంద్రంలో అధికారులు చెబుతు న్నారు. దీంతో తల్లిదండ్రులు పనులు మానుకుని ఆధార్ కేంద్రాలు, సచివాల యాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో 4255 మంది విద్యార్థులు ఉన్నారు. అం దులో 1100 మందికి పైగా ఆధార్‌లో ఉన్న వివరాలు సరిగా లేవు. దీంతో తహసీల్దార్ కార్యా లయం చుట్టూ విద్యార్థులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రె వెన్యూ సిబ్బందిని జనన ధ్రువీకరణ పత్రం గురించి అడిగితే పొంతన లేకుండా సమాధానం చెప్పడమే కా కుండా మాపై మండిపడుతున్నారని విద్యార్థులు, తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలా చేసుకోవాలి..

2012 ముందు జన్మించిన వారు తహసీల్దార్ వద్ద, 2012 తరువాత జన్మించిన వారు పంచాయతీ కార్యదర్శి వద్ద ముందుగా నాన్ అవైలబిటీ సర్టిఫికెట్ తీసుకోవాలి. అనంతరం సచివాలయాల్లో జనన ధ్రువీకరణ పత్రం కోసం నిర్దేశిత నగదు చెల్లించి అప్లై చేయాలి. గుర్తిపు పొందిన న్యాయవాదితో అఫిడవిట్ తీసుకోవాలి. రూ.50 చలాన చెల్లించాలి. సంబంధిత పత్రాలన్నీ వీఆర్‌వోకు అందజేయాలి. ఆయన పరిశీలించిన తర్వాత రెవెన్యూ అధికారి అనుమతి పొందిన తరువాత స్థానిక సచివాల యానికి వెళ్లి జనన ధ్రువీకరణ పత్రం పొందవచ్చు.

ఇన్‌చార్జి డాక్టర్లే దిక్కు

» అవస్థలు పడుతున్న పశుపోషకులు

» పట్టించుకోని అధికారులు



తాళం వేసి ఉన్న ఈదర

ముండ్లమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర, మారెళ్ల పశువైద్యశాలలకు ఇన్‌చార్జ్ డాక్టర్లే దిక్కయ్యారు. కొన్ని సంవత్సరాల నుంచి ఇన్‌చార్జ్‌లే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సకాలంలో వైద్యసేవలు అందక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన జిల్లా పశు వైద్యశాఖాధికారు లు ఆవైపు కూడా కన్నెత్తి కూడా చూడటం లేదు. మం డలంలోని ఈదర పశువైద్యశాలలో పని చేస్తున్న డాక్టర్ పేరయ్య చీమకుర్తి పరిధిలోని పశు వైద్యశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. దాదాపు ఐదు సంవత్సరాల నుంచి ఇన్ చార్జ్‌తోనే ఈదర పశువైద్యశాల నడుస్తుంది. ఈ పశువై ద్యశాల పరిధిలో పూరిమెట్ల, భీమవరం, బొప్పుడివారిపా లెం, కొమ్మవరం, అయోధ్యనగర్, పూరిమెట్ల గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో పశువులు ఏదైనా వ్యాధిబా రిన పడితే ప్రైవేట్ పశు వైద్యులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది.

ఈదర పశువైద్యశాలకు ఇన్‌చార్జ్‌గా తూర్పు గంగవ రం పశువైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ రాంబాబు కొన సాగుతున్నారు. మారెళ్ల పశువైద్యాధికారి కాశిరెడ్డి సెలవులో ఉండటంతో ముండ్లమూరు పశు వైద్యాధికారిణి ఎం.విజయలక్ష్మి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఒకే వైద్య శాలలో ఎక్కువ గ్రామాలు ఉండటం తో పశువులకు సక్రమంగా వైద్యం అందించ లేకపోతున్నారు. ముండ్లమూరు మండలంలో 37 వేల పశువులు ఉన్నాయి. ఇతర జీవులు, కోళ్ళు కూడా దాదాపు పదివేలకు పైగానే ఉన్నాయి. మండలంలో ఎక్కు వగా డెయిరీలతోపాటు కోళ్ళ ఫారాలు ఉన్నాయి. పశువైద్యుల కొరతతో సకాలంలో సేవలు అందడం లేదు. ప్రస్తుతం ఇద్దరే ఉండటంతో భారంగా మారింది. ఇప్పటికైనా జిల్లా పశువైద్యశాఖ అధికారులు స్పందించి రెగ్యులర్ పశువైద్యాధికారులను నియమించి తమ ఇబ్బందులను తొలగించాలని పశుపోషకులు కోరు తున్నారు.

తీరం అల్లకల్లోలం



ఒడ్డుకు చేరిన బోటులు



సముద్రతీరంలో పరిస్థితులను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

» ఆర్డీవో, తహసీల్దార్ పర్యటన

» మత్స్యకారులకు ఆంక్షలు, అధికారులకు సూచనలు

వాడరేవు(చీరాలటౌన్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా ఏర్పడిన తుఫాన్ ప్రభావం వలన చీరాల నియోజకవర్గ పరిధిలోని వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం సముద్రతీరంలో అలల ఉధృతంగా ఎగిసి పడుతున్నాయి. ఈక్రమంలో కొంత మేరకు సముద్రం ముందుకు పెరిగింది. దీంతో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ సిబ్బందితో కలిసి తీరంలో పర్యటించారు. గంటకు సుమారు 90 మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. మత్స్యకారులకు వేటకు వెళ్లరాదని సూచించారు. సురక్షిత ప్రదేశాలలో ఉండాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే వాయుగుండం కారణంగా మత్స్యకారులు ఇప్పటికే బోటులను ఒడ్డుకు చేర్చారు. వేట నిషేధించడంతో పూట గడిచేందుకు తిప్పలు తప్పడంలేదని మత్స్యకారులు వేదన చెందారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని అధికారులు చెప్పారు. అధికారులు పలువురు సిబ్బంది ఉన్నారు.

వాగొచ్చినా.. వరదొచ్చినా రాకపోకలకు ఇబ్బందే



రాజుగారిపాలెం వాగుపై ఉన్న లో చప్టా



డేగరమూడి వాగుపై ఉన్న చప్టా

» రెండు చోట్ల బ్రిడ్జిల నిర్మాణం అవసరం

మార్టూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండు గ్రామాల పరిధిలోలో చప్టాలు (పైపులకల్వర్టు) ఉన్నాయి. వాటి స్థానంలో బ్రిడ్జిలు నిర్మించాల్సిన అవసరం, ఆవశ్యకత ఉంది. వాటిలో డేగరమూడి వద్ద ఉన్న లోచప్టా వద్ద వరద నీరు వచ్చినా, వాగు నీటి ప్రవాహం పెరిగినా మార్టూరు మండలం నుంచి డేగరమూడి మీదుగా యద్దనపూడి మండలం చింతపల్లిపాడు, యనమదల, యద్దనపూడి గ్రామాలకు వెళ్లే ప్రజల రాకపోకలు ఆగిపోతాయి. అదేవిధంగా రెండవ లోచప్టా రాజుగారిపాలెం గ్రామ పరిదిలో ఉంది. మార్టూరు నుంచి బొబ్బేపల్లి, ద్రోణాదుల గ్రామాలకు దగ్గరదారిగా రాజుగారిపాలెం మీదగా వెళతారు. అయితే రాజుగారిపాలెం వద్ద లోచప్టా వద్ద వాన నీరు పెరిగితే ఈ రోడ్డు ప్రజల రాకపోకలకు బంద్ అయినట్లే. వాస్తవానికి ఎగువన రాజుగారిపాలెం వాగు ఉంటే దిగువన డేగరమూడి వాగు ఉంది. ఈ వాగులపైనే రెండు లోచప్టాలు ఉన్నాయి. భారీగా వర్షం కురిసినా, లేదా ఏదైనా తుఫాన్‌ల సమయంలో వాగు నీరు పెరగడంతో రెండు లోచప్టాల వద్ద భారీగా నీరు ఉధృతంగా, వేగంగా ప్రవహిస్తుంది. గతేడాది రాజుగారిపాలెం చప్టాపై ద్విచక్రవాహనదారుడు పారుతున్న నీటిపై వెళుతూ, నీటి వేగాన్ని అంచనా వేయలేక ద్విచక్రవాహనాన్ని నీటిలోనే వదిలేసి ప్రాణాలు దక్కించుకున్నారు. భారీగా వర్షపునీరు చేరినపుడు ఈ లోచప్టాల వద్ద పోలీసుల బందోబస్తు మాత్రం ఏర్పాటు చేస్తుంటారు. గత పాతికేళ్ల నుంచి ఈ చప్టాల వద్ద ఇదేపరిస్థితి నెలకొని ఉంది.

ఎమ్మెల్యే ఏలూరిపైనే ఆశలు పెట్టుకున్న ప్రజలు

రెండు లో చప్టాల స్థానంలో కొత్తగా బ్రిడ్జిల నిర్మాణంపై మండల ప్రజలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పైనే ఆశలు పెట్టుకున్నారు. ఆయన జొన్నతాళి, చిమ్మిరిబండ గ్రామాల మధ్య ఉన్న లోచప్టా స్థానంలో కొత్తగా బ్రిడ్జి నిర్మాణం జరగడానికి 2017-18 కాలంలో కృషి చేశారు. అదేవిధంగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా ఏలూరి మూడోసారి విజయం సాధించడంతో రెండుచోట్ల కొత్త బ్రిడ్జిల మంజూరుకు ఆయన కృషి చేస్తారని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు.

తప్పిన ముప్పు

» జిల్లాపై తుఫాన్ ప్రభావం నామమాత్రం

» కొన్ని ప్రాంతాల్లో జల్లులు

» పెరిగిన చలి తీవ్రత

ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పింది. ఆ ప్రభావం చిరుజల్లులకే పరిమితమైంది. రెండు, మూడు రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతోపాటు ఈదురుగాలులు వీస్తుండంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావం జిల్లాపై అధికంగానే ఉండొచ్చన్న సంకేతాలు తొలుత వాతావరణ శాఖ నుంచి అందాయి. తమిళనాడు తీరంలో చెన్నైకి సమీపంలో తుఫాన్ కేంద్రీకృతమై ఉండటంతో ఆ ప్రభావం జిల్లాపై ఉంటుందని ప్రజానీకం కూడా భావించింది. వాతావరణ శాఖ కూడా శుక్రవారం నుంచి మూడురోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అయితే తుఫాన్ ప్రభావం జిల్లాపై అంతగా చూపలేదు. పొరుగున ఉన్న నెల్లూరుతోపాటు తిరుపతి, అన్నమయ్య జిల్లాలలో జోరు వానలు కురుస్తున్నా ఇక్కడ మాత్రం జల్లులకే పరిమితమైంది. అవి కూడా శుక్రవారం సాయంత్రం నుంచి తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని ఒంగోలు, కొత్తపట్నం, సింగరాయకొండ, జరుగుమల్లి, మద్దిపాడు, ఎస్.ఎన్.పాడు, ఎన్‌జీపాడు, కొండపి తదితర మండలాల్లోనే పడ్డాయి. తుఫాన్ ప్రభావంతో ఉష్ణోగ్రతలు తగ్గడంతోపాటు చలితీవ్రత పెరిగింది. మూడు రోజులుగా ఇలాంటి వాతావరణమే నెలకొంది. ఈ పరిస్థితి జిల్లా ప్రజానీకాన్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మరోవైపు వాతావరణంలో వచ్చిన మార్పులతో ఎప్పుడు వర్షం కురుస్తుందోనని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని పొగాకు, శనగ సాగు చేసే రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

పకడ్బందీగా పథకాల అమలు

» దిశ సమావేశంలో మంత్రి డోలా, ఎంపీ మాగుంట » సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశంలో వారు పాల్గొన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ జాతీయ రహదారులకు సంబంధించి తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను, తాగునీటి పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, సైడు కాలువల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాం : ఎంపీ మాగుంట

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష చేస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి మంజూరు చేసిన నిధులను మండలాలు, గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని సూచించారు.



దిశ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట తదితరులు

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ జిల్లాలో లఖ్‌పతి దీదీ పథకం విజయవంతంగా అమలవుతున్నదన్నారు. సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా సూర్యఘర్ పథకాన్ని జిల్లాలోని 5లక్షల ఇళ్లకు విస్తరించడంపై దృష్టి సారించాలన్నారు.

ఎమ్మెల్యేలు ప్రస్తావించిన అంశాలు ఇవీ..

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ నగరానికి పశ్చిమం వైపు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని కోరారు. అమృత్ పథకం కింద చేపట్టిన పనులు పూర్తి చేస్తే ఒంగోలుకు ప్రతి రోజూ తాగునీరు ఇవ్వొచ్చన్నారు.

సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేర్నమిట్ట వద్ద ఉన్న చెరువును అమృత్ పథకంలో చేర్చాలని కోరారు. గుండ్లకమ్మ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు సంబంధించి రెండు మోటార్లు పని చేయడం లేదని, కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్‌హెచ్ 656 జాతీయ రహదారిలో మగ్గంపల్లి వద్ద లైట్స్ పనిచేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సమావేశం దృష్టికి తెచ్చారు. తాగునీటి పథకాలకు సంబంధించి కొత్త పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం ఉందని తెలిపారు.

గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఒంగోలు నగర మేయర్ సుజాత, డీఆర్వో చినఓబులేషు, జడ్పీ సీఈవో చిరంజీవి, సీపీవో వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులతోపాటు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి డీఈవో నుంచి ట్రోఫీ అందుకుంటున్న గుంటూరు బాలికలు

విద్యార్థులకు క్రీడలూ అవసరమే

» డీఈవో వాసుదేవరావు

» అంతర్ జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

» గుంటూరు ప్రథమ, శ్రీకాకుళం ద్వితీయ స్థానాలు కైవసం

బిక్కవోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడలు ప్రతి విద్యార్థికీ అవసరమని జిల్లా విద్యా శాఖాధికారి పి.వాసుదేవరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 బాలికల పోటీలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో డీఈవో మాట్లాడుతూ క్రీడలకు గతంలో 2శాతం కోటా వుండేదని దానిని కూటమి ప్రభుత్వం 3శాతానికి పెంచిందని, క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. తల్లిదండ్రులందరూ చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాలు సాధించిన గుంటూరు, శ్రీకాకుళం, విశాఖ, ప్రకాశం జట్ల బాలికలకు ఆయన ట్రోఫీలు అందజేశారు. క్రీడలు దిగ్విజయంగా నిర్వహించిన జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ. స్వామిని, పీడీ అసోషియేషన్ సభ్యులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల అబ్జర్వర్ సీహెచ్ రజనీదేవి, హెచ్ఎం పి.వీరప్రభాకరరావు, పీడీ, పీఈటీ అసోషియేషన్ అధ్యక్షులు ప్రసాద్, గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి అప్పారెడ్డి, అనపర్తి జోన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి టీవీ. రాఘవరెడ్డి, పీడీలు వై.బంగార్రాజు, మానుకొండ ధనరాజు, నందిపాటి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి యువరాజారెడ్డి, వీకేఆర్.తంబి, ప్రభాకర్‌రెడ్డి, ఎంఈవో కె.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

ఫైనల్స్‌లో గుంటూరు - శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంటూరు 35-27, 35-27 స్కోరుతో శ్రీకాకుళంపై విజయం సాధించి ప్రథమ స్థానం సాధించగా, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానం పొందింది.. అలాగే విశాఖ.. ప్రకాశం జట్టుపై 35-30, 35-31 స్కోరుతో గెలుపొంది ద్వితీయ స్థానం పొందగా ప్రకాశం జట్టు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది..

వైపాలెం టీడీపీలో అదేతంతు

» మంగళగిరి వెళ్లిన మరో బృందం

» సీరియస్ అయిన రాష్ట్ర నాయకత్వం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో పాత కథ పునరావృతమవుతోంది. అందుకు ఇటీవల అటు రాష్ట్ర, ఇటు జిల్లా నేతల వద్ద నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు ఫిర్యాదులు చేసుకోవడం దర్పణం పడుతోంది. పక్షం క్రితం ఎర్రగొండపాలెం మండలానికి చెందిన కొందరు టీడీపీ శ్రేణులు రాష్ట్ర నాయకుల వద్దకు వెళ్లి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుపై ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే నియోజకవర్గానికి చెందిన ముఖ్యనాయకులంతా ఎరిక్షన్ బాబుకు మద్దతుగా ఆపార్టీ పార్లమెంట్ అధ్యక్షుడిని కలిసి మంగళగిరి వెళ్లిన శ్రేణులపై ఆరోపణలు చేశారు. తిరిగి శనివారం దోర్నాల మండలం నుంచి మరో బృందం ఎరిక్షన్‌బాబుకు వ్యతిరేకంగా రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లింది. ఎర్రగొండపాలెం నియోజకవర్గం 2009లో పునఃప్రారంభమైంది. అప్పటి నుంచి దళితులకు కేటాయించారు. స్థానికంగా దీటైన నాయకుడు లేకపోవడంతో బయటి నేతలకు పోటీచేసే అవకాశం టీడీపీ కల్పిస్తూ వచ్చింది. 2009లో పోటీచేసి ఓడిపోయిన డేవిడ్‌రాజు 2014 ఎన్నికల నాటికి వైసీపీలో చేరారు. టీడీపీ అజితారావును అభ్యర్థిగా రంగంలోకి దింపింది. ఆ ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఆమె పెత్తనం ప్రారంభమైంది. వెంటనే నియోజకవర్గంలో ఉన్న స్థానిక నాయకులు ముఖ్యంగా ఒక సీనియర్ నేత అండతో ఆమెకు వ్యతిరేకంగా పనిచేయడం ప్రారంభించారు. అప్పట్లో అజితారావు వైపు నుంచి సమస్యలు ఉండటంతో ఆమెను తొలగించి స్థానిక నాయకుల్లో ముగ్గురిని త్రిసభ్య కమిటీగా టీడీపీ ఏర్పాటు చేసింది. 2019 ఎన్నికల నాటికి అభ్యర్థి కరువవ్వడంతో అజితారావును మళ్లీ తెచ్చి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో ఓటమి తర్వాత మళ్లీ ఆమె కనుమరుగయ్యారు. పార్టీపై స్థానిక నాయకులు పెత్తనం చేయడం ప్రారంభించారు. టీడీపీ అధిష్ఠానం వ్యూహాత్మంగా పార్టీ సీనియర్ అయిన ఎరిక్షన్‌బాబుకు సాధారణ ఎన్నికలకు మూడేళ్లు ముందుగానే ఎర్రగొండపాలెం బాధ్యతలు అప్పగించి అక్కడికి పంపింది. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఆయన ఓటమి చెందారు. ప్రస్తుతం ఆయన ఇన్‌చార్జిగా హవా సాగిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ మురళి

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను ప్రజలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ ఎం.మురళి సూచించారు. దర్శిలోని చైతన్య పాఠశాలలో శనివారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ యువత అతి వేగంతో వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదా లకు గురై ఎంతో విలువైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తాచాటిన వ్యవసాయ కళాశాల విద్యార్థి



మునయ్యకు కప్ అందజేస్తున్న శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎస్ పురం మండలంలోని కదిరిబాబు రావు వ్యవసాయ కళశాల కు చెందిన మునయ్య అనే విద్యార్థి షాట్ పుట్‌లో ప్రథమస్థానం సాధించాడు. శ్రీకాకుళం జిల్లాలోని నైరా వ్యవసాయ కళాశాలలో జరిగిన అంతర కళాశాలల క్రీడా పోటీలలో కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మూడవ సంవత్సరం చదువుతున్న మునయ్య షాట్‌పుట్‌లో సత్తాచాటి మొదటి స్థానం సాధించాడు.

అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

దర్శి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పంచాయతీలోని అన్నిప్రాంతాల్లో నూరుశాతం సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేస్తామన్నారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు ఇంటింటికి కొళాయి పథకాన్ని అమల్లోకి తెస్తామన్నారు. అమృత పథకం అమలుకు సమావేశం ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పింఛన్‌ను వినియోగించుకోవాలి

» ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులు పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. 1వ తేదీ ఆదివారం రావడంతో ముందుగానే శనివారం పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మండల పరిధిలో తోటవారిపాలెం, బుర్లవారిపాలెం గ్రామాల్లోను, చీరాల మున్సిపల్ పరిధిలోని 10, 11 వార్డుల్లో జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పేరాల మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముత్యాలపేట వీవీ స్పెషల్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా సందర్భాల్లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హ యాంలో జగన్ బటన్ నొక్కుతున్నానంటూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధిని గాడిలో పెట్టేందుకు నిర్విరామంగా పనిచేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ప్రజా ప్రయోజనాలు, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం నినాదాలతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఆయా ప్రాంతాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


పంగులూరులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు

అద్దంకి మండలంలో 96 శాతం పంపిణీ

అద్దంకిటౌన్ : లబ్ధిదారులకు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బత్తిని సింగయ్య అన్నారు. శనివారం మండలంలోని బొమ్మనంపాడు, నాగులపాడు గ్రామాలల్లో జరుగున్న పింఛన్‌ల పంపిణీని ఆయన పరిశీలించారు. శనివారం మండలంలో 96శాతం పంపిణీ చేసి, బాపట్ల జిల్లాలో మొదటి స్థానంలో అద్దంకి ఉందని సింగయ్య తెలిపారు.

పంగులూరు : మండలంలో శనివారం 93 శాతం పింఛన్‌లను పంపిణీ చేశారు. 21 గ్రామ పంచాయతీలలో 7,862 మందికిగాను 7,310 మందికి పింఛన్ ఇచ్చినట్లు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో శనివారం సాయంత్రానికి 94 శాతం పింఛన్‌ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో కె. కుసుమకుమారి తెలిపారు. మండలంలో 7646 మందికి గాను 7204 మందికి అందించామని మిగిలిన వారికి వెంటనే అందించేలా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో పేర్కొన్నారు.

చినగంజాం : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి పరిశీలించారు. చినగంజాం, కడవకుదురు, మున్నంవారిపాలెం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, పల్లెపాలెం తదితర గ్రామాల్లో పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీల్లో 5901 మందికి గాను 5670 మందికి పింఛన్ పంపిణీ చేసి 97శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.


పల్లెపాలెంలో పింఛన్ అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసమూర్తి

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ

పర్చూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్చూరులోని జూనియర్ కళాశాలలో డేటా ఎం ట్రీ ఆపరేటర్ కోర్సుకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ శనివారం ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ, యువతీ, యువకులు అర్హులన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు నిరుద్యోగులు డిసెంబర్ 2లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 6302764962 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు

చీరాలటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని వారిపట్ల సానుభూతితో మెలగాలని పలువురు మహిళా మండలి ప్రతినిధులు అన్నారు. ఆదివారం వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవీ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. రోగ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వెంకటరావు, ఫ్యామిలీ కౌన్సెలింగ్, వృద్ధాశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహనతో నిర్మూలనకు కృషి చేయాలని డాక్టర్ వెంకట కిరణ్ పిలుపునిచ్చారు. శనివారం డిసెంబర్ 1న అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి సీహెచ్‌సీలో రోగులకు అవగాహన కల్పించారు. డాక్టర్ వెంకట కిరణ్, డాక్టర్ అనితా జ్యోతి వ్యాధి వ్యాప్తి, నిర్మూలన, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ఓబుల్ రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్, సంస్థ సభ్యులు కరుణ, మల్లేశ్వరి, శివపార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా శనివారం మార్టూరు సెంటర్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది, రోటరీక్లబ్ వారు, హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ విష్ణుతేజ, వైద్యులు అశోక్ రెడ్డి, భానుచంద్రనాయుడు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో నిర్మాణం ప్రభుత్వానిదే

» మాజీ మంత్రి గాదె

ఇంకొల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో ఆర్టీసీ డిపో నిర్మాణం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని పావులూరులో ఆయన స్వగృహంలో విలేకరులతో మా ట్లాడారు. శనివారం మండలంలోని నాయకులు గాదెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇంకొల్లులో ఆర్టీసీ డిపో నిర్మాణం చేసేందుకు పావులూరు రోడ్డులో స్థలాన్ని కేటాయించి శంకుస్థాపన చేసినట్లు ఆయన గుర్తు చేశారు. డిపో నిర్మిస్తే ఇంకొల్లు చుట్టుపక్కల సమారు 140 గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుందన్నారు.


మాట్లాడుతున్న గాదె

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి


పోలీసులకు సూచనలు ఇస్తున్న న్యాయాధికారి శాంతి

పర్చూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాజీ మార్గంలో ఇరువర్గాలు కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందని, దీనిపై అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.శాంతి అన్నారు. శనివారం కోర్టు భవనాల సముదాయంలో డిసెంబర్ 14న నిర్వహించే లోక్‌అదాలత్‌పై పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయాధికారి శాంతి మాట్లాడుతూ ఎవరినీ బలవంతంగా రాజీ పడేలా మాట్లాడవద్దని పోలీసు అధికారులకు సూచించారు. ఇరువురి అంగీకారంతోనే కేసులను పరిష్కరించాలన్నారు. లోక్ అదాలత్ వల్ల డబ్బుతోపాటు, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఈ సమీక్షలో కాంచేడు, ఇంకొల్లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

20 నిమిషాలలో 44 అంశాలకు ఆమోదం

అద్దంకి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ సమావేశం శనివారం మొక్కుబడిగా జరిగింది. చైర్ పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన 44 అంశాలను ఆమోదించారు. 20 నిమిషాలలో అన్ని అంశాలు చదవడం పూర్తి కాగా, చైర్ పర్సన్ ఎస్తేరమ్మ ఆమోదించినట్లు ప్రకటించారు. అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్‌లలో ఏ ఒక్కరూ నోరు విప్పలేదు. ఏ ఒక్క అంశం పైనా చర్చ చేయలేదు. కనీసం ప్రజా సమస్యలను కూడా కౌన్సిల్‌లో చర్చించకపోవడం విమర్శలకు తావిస్తుంది. వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కమిషనర్ రవీంద్ర, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

పంగులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే గ్రామాలలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో శుక్రవారం రాత్రి అధికారులతో కలసి విఠలేశ్వర్ పల్లెనిద్రను చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో జరిగిన సమావేశంలో ఏఎస్పీ వారి సమస్యలను తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలు, చెడు వ్యసనాలతో ఉన్న వ్యక్తుల సమాచారం తెలుసుకున్నారు. సమాజంలో సైబర్ నేరాలు జరిగే తీరును వివరించిన ఏఎస్పీ ప్రజలు వాటిబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. రోడ్డు ప్రమాదాలబారిన పడకుండా పాటించాల్సిన నిబంధనలు, ప్రయాణ సమయంలో హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. మహిళలు, చిన్నారులకు పోలీస్ రక్షణగా ఉంటుందని, ఎవరైన వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని విఠలేశ్వర్ హెచ్చరించారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు, 112 నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు.కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ వినోద్‌బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్


భగవద్గీత పుస్తకాలతో బాలికలు

జ్ఞానాన్ని పెంచే భాండాగారం భగవద్గీత

పంగులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత విద్యార్థుల మేధస్సును పెంచే జ్ఞాన భాండాగారం అని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరావు అన్నారు. మండలంలోని ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం భగవద్గీత పుస్తకాలను అందచేశారు. ప్రతి వ్యక్తి చదవాల్సిన మంచి పుస్తకం భగవద్గీత అని ఆయన సూచించారు. కార్యక్రమంలో దాస సాహిత్య మండల కోఆర్డినేటర్ ధూళిపాళ్ల పార్వతి, అన్నాబత్తిన అరుణ, పాఠశాల హెచ్ఎం. పుచ్చకాయల ప్రసాద్, జాగర్లమూడి కవిత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళకు కుట్టుమిషన్ అందజేత

మార్టూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆశ్రమంలో శనివారం రోటరీ క్లబ్ సభ్యులు రమణ అనే మహిళకు కుట్టుమిషన్ అందచేశారు. ఆశ్రమంలో గత 3 నెలలుగా మహిళలకు కుట్టు మిషనులో శిక్షణ ఇచ్చారు. వారి శిక్షణ పూర్తికావడంతో 26 మందికి సర్టిఫికెట్లను ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందు ఆధ్వర్యంలో అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు రావుల బాపయ్య సాయం అందజేశారు. కార్యక్రమంలో రావి అంకమ్మచౌదరి, మద్దుమాల కోటేశ్వరరావు, సాంబశివరావు, ఆంజనేయులు, కంటి వైద్యుడు కె సుబ్రమణ్యం, షేక్ కాజా హుస్సేన్ పాల్గొన్నారు.

ఆహార నియమాలతోనే ఆరోగ్యం

చీరాలటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆహార నియమాలతో ఆనందంగా జీవిస్తారని గుండె వైద్య నిపుణడు డా.ఐ.బాబూరావు అన్నారు. స్థానిక ఉడ్ నగర్‌లోని ఆనంద నిలయం ప్రభుత్వ వసతి గృహంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు గుండె, దంత పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఆహారం, ఏ సమయంలో తినాలి, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డా.ప్రదీప్, సాదిరెడ్డి, ఐ.సుభాషిణి, వార్డెన్‌లు సుజాత, ఆనందకుమారి పాల్గొన్నారు.


ప్రభాకర్‌రెడ్డి, గిరిజ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

పాత్రలతో అందరికీ గుర్తుండి పోతారు

అద్దంకిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సినిమాలలో నటులు తమకు ఇచ్చిన పాత్రలతో అలరించి ప్రజల మనస్సులో ఎల్లప్పుడూ గుర్తుండి పోతారని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. శనివారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభ మూర్తులు - మధురస్మృతుల సభ జ్యోతి చంద్రమౌళి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సినీ నటులు ప్రభాకర్‌రెడ్డి, మరో నటి గిరిజ చిత్రపటాలకు సభ్యులు నివాళులర్పించారు. ప్రభాకర్‌రెడ్డి నటించిన చిత్రాలు, ప్రాధాన్యతను దాసరి లక్ష్మి, నటి గిరిజ గురించి గ్రంధి నాగరాజ కుమారి ప్రసంగించారు. కార్యక్రమానికి సీతారామశాస్త్రి ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య, చప్పిడి వీరయ్య, అన్నమనేని వెంకట్రావు, ఆర్‌వీ రాఘవరావు, డాక్టర్ దేవపాలన, చందలూరి నారాయణరావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చీరాల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలకు చెందిన వారికి సంబంధించి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య శనివారం పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. చుక్కా నాగవెంకట్ (గంజి పాలెం)కు రూ.88,478, వెంకటసాయి మణికంత (పాపరాజుతోట) రూ.1,00,516, రామేశ్వరం అభినవ్(ఈపురుపాలెం) రూ.2.50లక్షలు, చల్లా శ్రీనివాస్(విఠల్‌నగర్) రూ.88,346, నర్రా ఆంజనేయులు (గవినివారిపాలెం)రూ.52,292, బీ శ్రీనివాసరావు (హరిప్రసాద్‌నగర్) రూ.28,848, ఎనుములు మల్లేశ్వరి (బుర్లవారిపాలెం), రూ.20వేల చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు కార్తీక వనభోజనాలు

ఇంకొల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రాహ్మణులకు శనివారం కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలను ఏర్పాటు చేశారు 300 మందికిపైగా బ్రాహ్మణులు హాజరయ్యారు.

ఈపూరుపాలెంలో పలుచోట్ల చోరీకి యత్నం

- పలు దుకాణాల తలుపులు పగులగొట్టిన దుండగుడు
- మీ సేవా కేంద్రంలో రూ.40వేల అపహరణ
- సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు
- తూర్పుగోదావరి వ్యక్తిగా గుర్తింపు
- పాత దొంగగా ఆనవాళ్లు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం ఈపూరుపాలెంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి పలు దుకాణాల్లో చోరీలకు యత్నించాడు. దర్జాగా దొంగతనానికి ఉపయోగకరంగా ఉండే విధంగా లైటును తయారు చేసుకొని పలు దుకాణాల తలుపులను ఓపెన్ చేసి విఫలమయ్యాడు. అయితే మీ సేవా కేంద్రంలోకి చొరబడి రూ.40వేలు నగదును అపహరించాడు. ఉదయాన్నే విషయం తెలుసుకున్న సెంటర్ నిర్వాహకుడు కాటూరి చెంబయ్య దుకాణంలో వస్తువులు చిందరవందరగా ఉండడమే కాకుండా నగదు అపహరణ అయినట్లు గుర్తించారు. వెంటనే ఈపూరుపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ క్లూస్ టీం సహాయంతో ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు.


సీసీ ఫుటేజీకి చిక్కిన చోరీకి పాల్పడిన దుండగుడు

నిందితుడిని ఇప్పటికే పసిగట్టిన పోలీసులు

చోరీలకు పాల్పడిన వ్యక్తిని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఇతని వయసు సుమారు 40 ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. ఇతడు గతంలోనూ పట్టణంలో పలు చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈక్రమంలోనే గాలింపు చర్యలు ప్రారంభించారు.


క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పొలిమేర వీరాంజనేయస్వామికి పూజలు

ఇంకొల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరు పొలిమేర వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి ప్రత్యేక ఆకు పూజను చేసారు.

మెలకువలతో విద్యార్థులను తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంవో మోజెస్

చీరాలటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శిక్షణలో తెలుసుకున్న మెళకువలతో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఏఎంవో మోజెస్ అన్నారు. గత సోమవారం నుంచి శనివారం వరకు వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో 1,2 తరుగతుల విద్యార్థులకు బోధన అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన 266 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. చివరి రోజు శనివారం ముగింపు సమావేశం ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా జిల్లా ఏఎంవో మోజెస్, స్టేట్ అబ్జర్వర్ మాధవీలత మాట్లాడారు. కార్యక్రమంలో సాల్ట్ ప్రతినిధి రాజశేఖరరెడ్డి, సుభాని, ఏఆర్ఎంటీలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

మెరుగైన చికిత్సకు లోకేష్ ఆదేశం

బల్లికురవ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుంటూరు శ్రీనివాసరావుచౌదరి శనివారం అప్పుల బాధలతో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు.. గొర్రెపాడుకు చెందిన శ్రీనివాసరావు అనే యువకుడు కొంత కాలంగా ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాడు. గతంలో నారా లోకేష్ టీంలో పనిచేసి ఈ మధ్య కాలంలో స్వగ్రామానికి చేరాడు. అ వివాహితుడైన శ్రీనివాసరావుకు అప్పులు బాగా పెరిగాయి. దీంతో ఏం చేయాలో పాలుపోక తన ఇంటిలోనే పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాసరావును గుర్తించిన కుటుంబ సభ్యులు చిలకలూరిపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. విషయాన్ని వారి బంధువులు మంత్రి లోకేష్ టీం దృష్టికి, మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న మంత్రి లోకేష్ వెంటనే టీడీపీ కార్యకర్త శ్రీనివాసరావుకు మెరుగైన చికిత్సను అందించాలని తన టీం సభ్యులకు ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు సమాచారం.

పరామర్శించిన హర్షవర్ధన్

చిలకలూరిపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త గుంటూరు శ్రీనివాస్‌చౌదరిని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ పరామర్శించారు. వైద్యులను అడిగి శ్రీనివాస్ చౌదరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే ఏర్పాటు చేయాలన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

లారీని బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు

పంగులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. అందిన సమాచారం మేరకు కెమికల్ పౌడర్ లోడు చెన్నై నుంచి ఒడిశా వెళ్తున్న లారీని పులివెందుల నుంచి విజయవాడ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ముప్పవరం ఫ్లైఓవర్‌పై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న విజయవాడ బెంజిసర్కిల్‌కు చెందిన బండారు కీర్తి, పులివెందుల మండలం మల్లెల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ, రేపల్లెకు చెందిన వైష్ణవికి గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో అద్దంకి వైద్యశాలకు తరలించారు. పోలీసులు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ˘ర్యలు చేపట్టారు.

వెలగని వీధి దీపాలు

మేదరమెట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో వీధి దీపాలు వెలగడం లేదు. నాలుగు నెలలుగా వీధి దీపాలు వేలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సెంటర్‌లోని పాత మద్రాస్ రోడ్డులో రహదారులు, భవనాల శాఖ రెండు సంవత్సరాల కిందట వీధి దీపాలను ఏర్పాటు చేసింది. పాత చెక్ పోస్టు సెంటర్ నుంచి పాత గుంటూరు రోడ్డులోని పాత మార్కెట్ సెంటర్ వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. బస్టాండ్ ముందు డివైడర్ లేకపోవడంతో అక్కడ లైట్లు వేయలేదు. వేసిన సంవత్సరానికే కొన్ని బల్బులు పోయాయి. ముఖ్యంగా మేదరమెట్ల కూడలిలో ఏర్పాటు చేసిన లైట్లు వెలగకపోవడంతో సెంటర్‌లోకి వచ్చి వెళ్లేవారు, దుకాణాల వారు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి 10 గంటల తరువాత ఈ ప్రాంతమతా చీకటిగా ఉంటుంది. రాత్రివేళ వేరే ప్రాంతాల నుంచి మేదరమెట్ల వచ్చేవారు లైట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా లైట్లు లేకపోవడంతో అవి సక్రమంగా పని చేయడం లేదని దుకాణ యజమానులు అంటున్నారు. చుట్టుపక్కల ప్రాం తాలకు మేదరమెట్ల కూడలి కావడంతో ఇక్కడ విద్యుత్ దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త లైట్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.


మేదరమెట్లలో వెలగని వీధి దీపాలు

తండ్రిని హత్య చేసిన కొడుకు అరెస్ట్

అద్దంకి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో తండ్రి ముప్పరాజు వెంకటేశ్వర్లును హత్య చేసిన కుమారుడు సుబ్బారావును శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం కశ్యాపురానికి చెందిన ముప్పరాజు వెంకటేశ్వర్లు కుటుంబం అద్దంకి పట్టణంలోని భాగ్యనగర్ 3వ లైన్‌లో ఉంటున్నారు. భార్య 20 సంవత్సరాల కిందట, తల్లి రెండేళ్ల క్రితం మృతి చెందారు. దీంతో తండ్రి, కొడుకులు మాత్రమే ఉంటున్నారు. లారీ క్లీనర్ గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు కశ్యాపురంలో ఉన్న 80 సెంట్ల స్థలాన్ని 9 లక్షలకు అమ్మి వచ్చిన డబ్బుతో తండ్రీకొడుకులు జీవనం సాగిస్తున్నారు. కుమారుడు సుబ్బారావు మద్యానికి బానిసయ్యాడు. డబ్బు విషయమై ఇద్దరి మధ్యా తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి తండ్రి, కొడుకులు గొడవ పడ్డారు. తండ్రి వెంకటేశ్వర్లును కుమారుడు సుబ్బారావు బలంగా కొట్టడంతో రక్తస్రావం కావడంతో మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు. సుబ్బారావును శనివారం కలవకూరు క్రాస్ రోడ్స్ వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణయ్య




ముందుకు వచ్చిన సముద్రం

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో శనివారం కృష్ణపట్నం వద్ద సముద్రం 20 అడుగులు ముందుకు వచ్చింది. సముద్రంలో కూడా అలజడి ఎక్కువగానే ఉంది. తీర గ్రామాల్లో తహసీల్దారు బాలకృష్ణారెడ్డి పర్యటించి పరిస్థితులను సమీ క్షించి, వీఆర్‌వోలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, వలలను, బోట్లను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలని తెలిపారు.

6వ నెంబరు ప్రమాద హెచ్చరిక

ముత్తుకూరు, (ఆంధ్ర జ్యోతి): తుఫాన్ తీవ్రత పెరగడంతో కృష్ణపట్నం పోర్టులో శనివారం ఆరవ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగరవేశా రు. తుఫాన్ తీరం దాటే సమయంలో తీవ్ర ప్రభావం ఉన్నప్పుడే ఈ హెచ్చరికను ఎగుర వేస్తారు. శనివారం రాత్రి తుఫాన్ తీరం దాటవచ్చని, ఆ సమయంలో తీరంలో 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయ ని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తీరం దాటాక కూడా వర్షాలతోపాటు ఈదురు గాలులు ఉంటాయని హెచ్చరించారు.



ఫెంగల్ అలజడి

- సింహపురిని వణికిస్తున్న పెను తుఫాన్
- మోస్తరు నుంచి భారీ వర్షం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- తీరప్రాంతాల్లో వణుకు
- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ కీలక ఆదేశాలు
- 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ జిల్లాను వణికిస్తోంది. ఈ తుఫాన్ ప్రభావంతో శనివారం జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా సగటు వర్షపాతం 10.1 మిల్లీమీటర్లు నమోదవగా, అత్యధికంగా ఇందుకూరుపేటలో 42.8, అత్యల్పంగా వింజమూరు, మర్రిపాడులలో 1.2 మి.మీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరపిలేని వర్షం కురవడంతో కాలువలు, రోడ్లు జలమయం అయ్యాయి. రోడ్లపై గుంతలలో నీరు చేరటంతో వాహన రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. వర్షానికితోడు చలితీవ్రత పెరగడంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. కాగా, జిల్లాలోని సోమశిల, కండలేరు, రాళ్లపాడు తదితర ప్రధాన ప్రాజెక్టులతోపాటు నదులు, చెరువులకు నీరు వచ్చి చేరుతోంది. తుఫాన్ తీరం దాటినా దాని ప్రభావంతో ఆది, సోమవారాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

● అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం సోమశిల ప్రాజెక్టులో ఔట్‌ఫ్లో, ఇన్‌ఫ్లో సమానంగానే ఉన్నాయని తెలిపారు. అన్నమయ్య జిల్లా నుంచి సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరిగితే పరిస్థితిని బట్టి నీటి విడుదలకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు కూడా ప్రజలను జాగృతి చేస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సోమశిల నీటి ప్రవాహాన్ని అంచనావేస్తూ తదనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురైతే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తీరప్రాంత గ్రామాలు, పెన్నా పరివాహక ప్రాంతాల పరిధిలోని మండలాల్లో కంట్రోల్ రూములు రాత్రిపూట కూడా పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు.

● 'సోమశిల'కు ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 6,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.435 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 6,000, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. కండలేరు డ్యాంకూ వరద కొనసాగుతోంది.

పోలీసు, అగ్నిమాపకం సన్నద్ధం

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం పోలీస్, అగ్నిమాపక దళం సన్నద్ధమవుతోంది. పోలీసు సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటారని, అగ్నిమాపక సిబ్బందితో ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఆయా శాఖల అధికారులు ప్రకటించారు.

● 24 గంటలు అందుబాటులో : ఎస్పీ

జిల్లా పోలీసు సబ్ డివిజన్‌హెడ్ క్వార్టర్స్‌లో సహాయక చర్యలు కోసం 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక పోలీసు బృందాలను సిద్ధం చేశామని ఎస్పీ జి కృష్ణకాంత్ తెలి పారు. పరిస్థితులను బట్టి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ ఇతర శాఖల సమన్వయంతో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వంకలు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో నివసించు ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసులకు సూచించారు. గాలులు వీస్తున్న నేపథ్యంలో పూరిల్లు, రేకుల షెడ్డులలో నివశించే వారిని గుర్తించి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు తలెత్తితే 112, వాట్సప్ నెంబరుకు 9392903413 సమాచారం ఇవ్వాలని సూచించారు.

● ఆరు ప్రత్యేక బృందాలు : డీఎఫ్‌వో

ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని, బోట్ నడిపేందుకు రెండు టీమ్‌లు, ఉడ్‌కటింగ్‌కు రెండు టీమ్‌లు, రిస్క్యూ ఆపరేషన్‌కు రెండు టీమ్‌లు సిద్ధంగా ఉన్నారని డీఎఫ్‌వో వి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫైర్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సెలవులు రద్దు చేశామని, ఎలాంటి విపత్తులు వచ్చినా ప్రజలను కాపాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.


నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలవడంతో వాహనదారుల అవస్థలు


తోటపల్లిగూడూరు : కొత్తపాళెంలో నీటమునిగిన నారుమళ్లు


నెల్లూరు పొదలకూరు రోడ్డులోని ఎస్పీ కార్యాలయం వద్ద నిలిచిన వాన నీరు

8 నెలలు 500 కేసులు

- సగటున నెలకు 60 పాజిటీవ్‌లు
- చాపకిందనీరులా విస్తరిస్తున్న హెచ్ఐవీ
- నియంత్రణలో జిల్లాకు 8వ స్థానం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం

నిశ్శబ్దంగా మనిషిలోని రోగ నిరోధక శక్తిని హరింపజేసి, ప్రాణాలకే ముప్పుతెచ్చే హెచ్ఐవీ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. గడిచిన ఎనిమిది నెలల కాలంలో 500 కేసులు రికార్డుల్లోకి ఎక్కాయి. అంటే నెల 60 కొత్త కేసులు నమోదవుతున్నా యన్న మాట. ఇది ఆందో ళన కలిగించే అంశమే అయినా నియంత్రణలో వైద్య ఆరోగ్య శాఖ చేతు లెత్తేస్తోందన్న అపవాదు నెలకొంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను స్వచ్ఛంద సంస్థలకు మళ్లిస్తున్న అధికారులు వాటిపనితీరుపై మాత్రం పర్యవేక్షణ లేకుండా పోతోంది. మరోవైపు జిల్లాలో కేవలం 2202 మందికి పెన్షన్ అందుతుండగా, 5వేల మందికిపైగా దరఖాస్తు చేసుకుని ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఒక కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే బాధితులు ఆశలు పెట్టుకుని ఉన్నారు.



6

పొగాకు, మినుము రైతుల్లో ఆందోళన

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో ఆదివారం భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో పొగాకు, మినుములు సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలోని పొగాకు తోటలు రెలువుల దశకు వచ్చాయని, వర్షం కురిస్తే బంక కారిపోయి బొగులు ఆకు వస్తుందని వాపోతున్నారు. అలాగే నల్లరేగడి నేలల్లో కూడా ఇటీవల పొగనారు కొని బురద నాట్లు వేసి ఉన్నారు. ఈ దశలో భారీవర్షాలు పడితే పొగనాట్లు దెబ్బతినటం ఖాయమని చెబుతున్నారు. అలాగే కందుకూరు ప్రాంతంలో మరో ప్రధాన పంటగా ఉన్న మినుము ఇటీవల వర్షాలకే స్వల్పంగా దెబ్బతింది. అప్పటికే పూత, పిందె దశలో ఉన్న మినుము వర్షాలకు పూత రాలిపోయి ఇప్పుడిప్పుడే తిరిగి ఇగుర్లు వచ్చి పూతలు వస్తున్నాయి. ఈ దశలో మళ్లీ భారీవర్షాలు కురిస్తే ఇక మినుముపై ఆశలు వదులుకోవాల్సిందే అని అదే జరిగితే పెట్టుబడులు కూడా అందవని రైతులు అంటున్నారు. శనగ సాగుకు కూడా అదను దాటిపోతుందని అదను దాటాక శనగ వేసినా ఆశించిన దిగుబడులు రావంటున్నారు. ఈ స్థితిలో ఈ తుఫాన్ మమ్మల్ని నష్టపెట్టడానికే వచ్చినట్లుందని రైతులు చర్చించుకుంటున్నారు.


కందుకూరు ప్రాంతంలో సాగుచేసి ఉన్న లేత పొగనాట్లు

ఏ పరిధి ఎవరిది?

- ఇరిగేషన్‌లో బౌండరీల గందరగోళం
- జాఫర్ సాహెబ్ కాలువ వెంబడి ఆక్రమణలు
- మంత్రి ఆదేశించినా తొలగింపులో సరిహద్దుల వివాదం

7

మైనింగ్ డీడీ చంద్రశేఖర్ సరెండర్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్‌ను ఆ శాఖ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సెప్టెంబరు 29న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో ఏపీఎండీసీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్.చంద్రశేఖర్‌ను నెల్లూరు జిల్లా మైనింగ్‌శాఖ డీడీగా నియమించారు. అయితే విధుల్లో చేరినప్పటి నుంచి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిం చడంతో పలుమార్లు జిల్లా కలెక్టర్ మందలించారు. అయినా అతని పనితీరులో మార్పు రాకపోవడంతో ఆయనను రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో కేవలం రెండు నెలలు మాత్రమే విధులు నిర్వహిం చిన చంద్రశేఖర్‌ను సరెండర్ చేయడంతో మైనింగ్‌శాఖ కొత్త డీడీ ఎవరన్నది ఇంకా స్పష్టత రాలేదు.

జైళ్ల శాఖలో బదిలీలు

నెల్లూరు (క్రైం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జైళ్ల శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి జైళ్ల శాఖ డీజీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు కేంద్రకారాగార అదనపు సూపరింటెండెంట్ ఎ మహేష్ బాబును విశాఖ కేంద్ర కారాగారానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖ కేంద్ర కారాగార అదనపు సూపరింటెండెంట్ ఎం వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నెల్లూరు కేంద్ర కారాగార డిప్యూటీ సూపరింటెండెంట్ ఎన్ సాయిప్రవీణ్, కార్యాలయ సూపరింటెండెంట్ వి అప్పారావు విశాఖకు బదిలీ అయ్యారు. విశాఖ కేంద్ర కారాగారం కార్యాలయ సూపరింటెండెంట్ డి శరత్‌బాబు నెల్లూరుకు బదిలీ అయ్యారు.



ప్రాకారోత్సవంలో శివపార్వతుల ఉత్సవమూర్తులు

ముగిసిన కార్తీక సంబరం



నెల్లూరు నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వ రాలయంలో కార్తీక మాసోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. ఉదయం పాలాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తులు, ధ్వజస్తంభాలకు విశేష పుష్పాలంకారం జరిగింది. అనంతరం శివపార్వతులకు పుష్కరిణి చుట్టూ దీప హారతులతో ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆకాశ దీపాన్ని (అవగతం) దించి పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శిరీష దంపతులు, అల్లూరు గిరీష్‌రెడ్డి, లతా దంపతులు వ్యవహరించారు. భక్తులు జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తోటల్లో వనభోజనాలు, కార్తీక దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో జే.శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

- నెల్లూరు(సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

కమనీయంగా పెంచులోకి కల్యాణం



పెంచలకోనలో నరసింహస్వామి కల్యాణం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, కల్యాణోత్సవం జరిపారు. సాయంత్రం 5.30 గంటలకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత నరసింహస్వామి వారికి తిరుచ్చి, పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు ఆలయం ముందు కోలాటం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

రాళ్లపాడు కుడి, ఎడమ కాలువలకు

నీరు నిలుపుదల

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీటి సరఫరాను నిలుపుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ జి.చంద్రమౌళి తెలిపారు. ప్రస్తుతం ఫెంగల్ తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో సాయంత్రం నాలుగు గంటల సమయంలో రెండు కాలువల తూములను దించివేసినట్లు చెప్పారు. ప్రస్తుతం కుడి కాలువ నుండి 60కూసెక్కులు, ఎడమ కాలువ నుండి 15క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సోమశిల ప్రాజెక్టు నుండి 600 క్యూసెక్కుల నీరు విడుదల చేశారని, కానీ ఈ నీరు ప్రాజెక్టుకు వచ్చే సరికి మూడురోజులు పడుతుందని తెలిపారు.



వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్

వరిని కాపాడుకోండిలా..

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున వరి సాగు చేస్తున్న రైతులు సూచనలు, సలహాలు పాటించాలని ఉదయగిరి మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కోత దశలో ఉండగా, రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట పిలక దశలో ఉంది.

- పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు తోడేయాలి. వరి నారు నాటిన తరువాత పిలకపెట్టే దశలో మూడు రోజుల వరకు ఆకులు పూర్తిగా నీటి మునిగిన కూడా తర్వాత నీటిని తీసివేస్తే మొక్క నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది.
- ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి.
- వరిలో పాము పొడ తెగులు ఉధృతి ఎక్కువగా అయ్యే అవకాశముంది. ఈ తెగులు నివారణకు ట్రోపికోనజోల్ ఒక ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ఆకాశం మేఘావృతమై తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ఆకులై అగ్గి తెగులు సోకే అవకాశం ఉంది. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా కాసుగామైసిన్ 2.5 ఎంఎల్ లీటర్‌లో కలిపి పిచికారీ చేయాలి.
- వరిలో వర్షాలు తగ్గిన తర్వాత ఆకు ముడత పురుగు ఆశించే అవకాశమున్నందున కార్టాప్ హైడ్రోక్లోరైడ్ అనే మందును 2 గ్రాములు లీటరు నీటిలో కలిసి ఎకరాకు పిచికారీ చేయాలి.
- ముందుగా నాటిన వరి స్వల్పకాలిక రకాల్లో విత్తనం మొలకెత్త కుండా నిరోధించడానికి కోత దశలో ఉన్న వరిపై 5 శాతం ఉప్పు ద్రావణంతో పిచికారీ చేయాలి.
- వర్షాలకు పంటనష్టం జరిగితే గ్రామస్థాయిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులకు రైతులు సమాచారం అందించాలి.

8 నెలలు 500 కేసులు

- సగటున నెలకు 60 పాజిటీవ్‌లు
- చాపకిందనీరులా విస్తరిస్తున్న హెచ్ఐవీ
- నియంత్రణలో జిల్లాకు 8వ స్థానం
- అధికారుల మెతకవైఖరే కారణమా!?
- స్వచ్ఛంద సంస్థల పనితీరుపై విమర్శలు
- 12,500 మంది బాధితులు.. 2202 మందికే పెన్షన్
- కొత్తగా ఒక పెన్షనూ మంజూరు చేయని నాటి వైసీపీ సర్కారు
- బస్సుపాసుల రద్దుతో ఆర్థిక భారం
- కూటమి ప్రభుత్వంపైనే అభాగ్యుల ఆశలు

నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం



నెల్లూరు (వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లతో పోలిస్తే జిల్లాలో హెచ్ఐవీ కేసులు తగ్గినా ప్రస్తుతం నమోదవుతున్న కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. 8 నెలల కాలంలో (ఏప్రిల్ నుంచి) 500 కేసులు రికార్డుకెక్కడమే ఇందుకు కారణం. హెచ్ఐవీ నియంత్రణలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉండగా, పశ్చిమ గోదావరి 2వ స్థానం, అనంతపురం 3వ స్థానంలో ఉన్నాయి. అయితే, నెల్లూరు జిల్లా మాత్రం గతేడాదిలా 8వ స్థానంలో నిలిచింది. ఒక స్థానం కూడా ఎగబాకపోవడంపై వైద్య ఆరోగ్యశాఖపై విమర్శలు వ్యక్తమవు తున్నాయి. కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ శాక్స్) హెచ్ఐవీ నియంత్రణకు నిధులు విడుదల చేస్తుంది. ఆ నిధులను సరిగ్గా సద్వినియోగం చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. 2002తో పోలిస్తే 17.08 శాతం 2024కు నుంచి 0.06 శాతానికి హెచ్ఐవీ తగ్గుముఖం పట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే, క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంటోంది. జిల్లాలోనే ప్రతినెల హెచ్ఐవీ బాధితులు 60 మందికిపైగా నమోదవుతున్నారు. ప్రస్తుతం అధికారికంగా 12,500 మంది వరకు బాధితులు ఉన్నారు.

● 'స్వచ్ఛంద'ంగా చేతులెత్తేశారా!?

జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం న్యాకో ద్వారా ఏటా రూ.20 లక్షలు మంజూరు చేస్తోంది. నెల్లూరు కేంద్రంగా ఎస్ఎస్ఎంఏఎస్ స్వచ్ఛంద సంస్థతోపాటు మరో రెండు సీసీఎస్ సంస్థలు, కావలిలో సాస్ స్వచ్ఛంగా సంస్థ హెచ్ఐవీ నియంత్రణకు కృషి చేస్తున్నాయి. ఒక్కో సంస్థకు ఏటా రూ.5లక్షలకుపైగా కేంద్రం విడుదల చేస్తోంది. ఆయా సంస్థల ప్రతి నిధులు హెచ్ఐవీ ప్రబలే వర్గాలలో చైతన్యం తీసుకురావాలి. శృంగారంలో పాల్గొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేయాలి. అనుమానితులను జిల్లాలోని 7 ఎయిడ్స్ నిర్ధారణ కేంద్రాలకు తీసుకు వెళ్లి పరీక్షలు చేయించాలి. అయితే, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా స్వచ్ఛంద సంస్థలు పట్టీపట్టనట్లు వ్యవహరి స్తున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదన్న వాదన ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తోంది.

● వైద్యసేవలు ఇలా

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఏడు హెచ్ఐవీ కౌన్సెలింగ్, పరీక్షా కేంద్రాలు పని చేస్తున్నాయి. శిక్షణ పొందిన కౌన్సెలర్లు హెచ్ఐవీ పరీక్షలకు ముందు, తరువాత బాధితులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. సుఖవ్యాధులు ఉన్నవారిలో 10 శాతం మందికి హెచ్ఐవీ సోకే అవకాశం ఉన్నందున నెల్లూరులోని జీజీహెచ్, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాధితులకు ఉచితంగా మందులు అందించేందుకు జీజీహెచ్‌లో యాంటి రిట్రోవైరస్ థెరపీ (ఏఆర్టీ) సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా కావలిలో మరో సెంటర్ నడుస్తోంది. అలాగే బాధితులు ఎవరైనా 1097కు ఫోన్ చేసి వైద్యసేవలు పొందాలని అధికారులు కోరుతున్నారు. కొత్తగా ప్రెప్ ట్రీట్‌మెంట్ నూతన చికిత్సా విధానం ద్వారా చాలా వరకు వ్యాధిని అదుపులో ఉంచుకో వచ్చని చెబుతున్నారు.

హెచ్ఐవీ బాధితుల సంఖ్య			
సంవత్సరం	పరీక్షలు	బాధితులు	నిర్ధారణ శాతం
2019 -20	1,31,914	1007	0.7
2020- 21	70,966	577	0.8
2021- 22	1,50,457	710	0.5
2022 - 23	1,91,042	811	0.4
2023 - 24	1,21,946	741	0.6
2024 - 25	1,30,886	500	0.4

● బాధితులకు అందని పెన్షన్

హెచ్ఐవీ బాధితులకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల పెన్షన్ అందిస్తోంది. దీనికి కొన్ని నిబంధనలు విధించింది. 5 ఎకరాలు భూములు ఉన్నా, కరెంటు బిల్లులు ఎక్కువగా కడుతున్నా, ఇతర ఆస్తులు ఉన్నా ఈ పెన్షన్ రాదు. ప్రస్తుతం 2202 మందికి పెన్షన్ వస్తుండగా మరో 5వేల మందికి పెన్షన్ అందాల్సి ఉంది. నాటి వైసీపీ ప్రభుత్వం ఒక పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడంతో ఐదేళ్లుగా అర్హత ఉండీ పెన్షన్ అందుకోలేకపోతున్నారు. కాగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.2,750 ఉన్న పెన్షన్‌ను రూ.4వేలకు పెంచింది. ఇది బాధితులకు ఆర్థిక తోడ్పాటు ఇస్తోంది. మరోవైపు ఏఆర్టీ సెంటర్‌కు ప్రతినెల మందుల కోసం వచ్చేందుకు వీలుగా బస్‌పాసులు ఇస్తుండగా, వైసీపీ సర్కారు వాటిని రద్దు చేసింది. దీంతో బాధితులపై చార్జీల భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ఈ ప్రభుత్వంలోనైనా పింఛనుతోపాటు బస్‌పాసులు ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

హెచ్ఐవీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలో హెచ్ఐవీ కేసులు బాగా తగ్గాయి. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో స్వచ్ఛంద సంస్థలు చక్కగా పని చేస్తుండటంతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాము. గర్భవతులకు ముందస్తుగా హెచ్ఐవీ పరీక్షలు చేస్తున్నాం. ఎవరికైనా హెచ్ఐవీ ఉంటే పుట్టే పిల్లలకు రాకుండా ముందస్తు చికిత్సలు అందిస్తున్నాం. అయితే పింఛన్లు, బస్ పాసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి

పీఎంఏవై గృహాలకు భారీగా దరఖాస్తులు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా గృహాల కోసం భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. పేద, మధధధదదద్య తరగతి ప్రజల నుంచి గృహాలకు దరఖాస్తులు స్వీకరించాలని కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో నుడా పరిధిలోని నగరం, మండలాలు, పట్టణాల నుంచి హౌసింగ్ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. గూడులేని పేదలతో పాటు, స్థలాలు ఉండి, ఇళ్లు నిర్మించుకోలేని పేద, మధ్య తరగతి ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని తెలపడంతో నగరంతో పాటు మిగతా 7 నియోజకవర్గాల్లోని పేదలు గృహాలు కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. అలాగే స్థలాలు లేని నిరుపేదలకు టిడ్కో నిర్మించే అపార్టుమెంట్ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో గతంలో హౌసింగ్ ద్వారా ఇళ్ల నిర్మాణాలు పొందని వారంతా దరఖాస్తులు చేసుకుంటున్నారు. గత 20 రోజులుగా జిల్లాలో హౌసింగ్ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గం, మండలాల వారీగా వచ్చే దరఖాస్తులను స్వీకరించి, వాటిపై సర్వే చేస్తున్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలకు పేద, మధ్య తరగతి ప్రజలకు రేషన్, ఆధార్ కార్డుతో పాటు, రేషన్‌కార్డు లేని మధ్య తరగతి ప్రజలకు రూ.3లక్షల వరకు ఆదాయపు పన్ను కలిగిన వారందరిని అర్హులుగా నిర్ణయించారు. దీంతో అటు రేషన్‌కార్డు ఉన్న పేదలతో పాటు, రూ.3లక్షల వరకు ఆదాయపు పన్ను చెల్లించే మధ్య తరగతి ప్రజలు ఈ పథకానికి అర్హులుగా ఉన్నారు. దీంతో సొంత స్థలాలు ఉన్నా, లేకున్నా వారంతా దరఖాస్తు చేసుకుంటున్నారు.



● 9 వేలు వచ్చిన దరఖాస్తులు

జిల్లాలో ఇప్పటి వరకు 9వేల మేరకు దరఖాస్తులు ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకానికి అందాయి. ఇందులో నెల్లూరు సిటీ నుంచి 259, ఆత్మకూరు నియోజ కవర్గంలో 1390, కందుకూరులో 1063, కావలిలో 986, కోవూరులో 1669, నెల్లూరు రూరల్‌లో 676, ఉదయగిరిలో అత్యధికంగా 2,467, సర్వేపల్లిలో 640 దరఖాస్తులు అందాయి. వీటితో పాటు మరికొన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉండడంతో వచ్చేనెల 15 వరకు వీటిని స్వీకరించనున్నారు. అనంతరం వాటన్నింటిపై సర్వే చేసి అర్హత ఉన్న దరఖాస్తులను ప్రభుత్వానికి పంపనున్నారు. ఇప్పటి వరకు ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80లక్షలు ఇస్తుండగా, పీఎంఏవై పథకం ద్వారా ఈ మొత్తాన్ని భారీగా పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్ఆర్‌జీఎస్ నిధులతో పాటు ఒక్కో గృహానికి రూ.3.లక్షల వరకు నిధులు వచ్చే అవకాశం ఉన్నట్లు పాలకులు పేర్కొంటున్నారు. అయితే నిధుల ఖరారుపై కేంద్రం నుంచి విధివిధానాలు రావాల్సి ఉంది. ఈలోపు అర్హుల జాబితాను పూర్తిగా సేకరించి అధికార యంత్రాంగం వాటిని సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు.

తప్పని 'అపార్' కష్టాలు

- ఆధార్, పుట్టినరోజు సవరణలకు అగచాట్లు
- కార్యాలయాల చుట్టూ పది, ఇంటర్ విద్యార్థుల ప్రదక్షిణలు
- చేతులు తడిపితేకాని దరఖాస్తు కదలవంటున్న సిబ్బంది

వలేటివారిపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. సచివాలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు, తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. మండలంలో మొత్తం 54 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 3,900 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ఇప్పటివరకూ 1,600 మందికి మాత్రమే సర్టిఫికెట్ల కరెక్షన్ జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డులు ప్రక్రియ ఉపాధ్యాయులు, విద్యార్థులకు చుక్కలు చూపెడుతోంది. పాఠశాల రిజిస్టర్లు, ఆధార్ వివరాలకు సరిపోకపోవడంతో కార్డులు జారీలో జాప్యం అవుతోంది. సకాలంలో ఆ పని పూర్తి చేయపోతే ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేస్తామని విద్యాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో అపార్ పూర్తి చేసేందుకు వారంతా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నారు.

ఒకే ఒక్కటి..

మండలంలో వలేటివారిపాలెం సచివాలయంలో మాత్రమే ఆధార్ కేంద్రం ఉంది. విద్యార్థులందరినీ ఈ కేంద్రంలోనే సర్టిపికెట్లు కరెక్షన్ చేయాలి. మండలంలో 3,900పైగానే సర్టిఫికెట్ల కరెక్షన్ ఉంది. రోజుకు 50-60 సర్టిపికెట్లు కరెక్షన్ మాత్రమే అవుతున్నట్లు అధికారులు వాపోతున్నారు. ఇంకా 2,300 సర్టిఫికెట్లు కరెక్షన్ ఎప్పటికి పూర్తవుతాయోననే ఆందోళన చెందుతున్నారు. ఒక్క అక్షరం తేడా ఉన్న ఆధార్ మార్చుకోవాల్సిందేని ప్రధానోపాధ్యా యులు చెబుతుండడంతో విద్యార్థులు ఆధార్ కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారే తప్ప ఆ విషయంలో ముందడుగు పడడం లేదు. శివారు గ్రామాల్లోని విద్యార్థులు ఉదయం ఆరు గంటలకే బయలుదేరి మండలకేంద్రంలోని ఆధార్ కేంద్రానికి చేరుకుని సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. అదనపు కేంద్రాలు ఏర్పాటు చేస్తే కానీ ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం లేదు.



వలేటివారిపాలెం సచివాలయలో కరెక్షన్ కోసం క్యూ కట్టిన విద్యార్థులు

● ఉలవపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో లేట్ డేట్ ఆఫ్ బర్త్ ఎంట్రీ సర్టిఫికెట్లు ఆలస్యం అవుతున్నాయి. వీఆర్వోల దగ్గర నుంచి తహసీల్దారు వరకు రోజుల తరబడి పిల్లలు వారి తల్లిదండ్రులతో కలిసి కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు. పది మంది విద్యార్థుల్లో సగం మందికిపైగా ఆధార్ సవరణలు, పంచాయతీల రికార్డుల్లో పుట్టిన రోజు సరవణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆధార్‌లో నమోదైనా పుట్టినరోజుకి స్కూల్ రికార్డుల్లో నమోదు అయిన తేదీలకు పొంతన లేకపోవడంతో ఆధార్‌లో సవరణ చేయాలంటే 18ఏళ్లలోపు వారికి అధికారికంగా జారీచేసిన పుట్టిన రోజు సర్టిఫికెట్ తప్పనిసరైంది. స్థానిక పంచాయతీ కార్యాలయాల్లో ఎన్‌వోసీ తీసుకొని లేట్ డేట్ ఆఫ్ బర్త్ ఎంట్రీ కోసం తహసీల్దారు కార్యాలయంలో నమోదు చేసుకుంటే అక్కడ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయంకు ఫైల్ చేరుకునేందుకు వారం నుంచి 10రోజులు పడుతున్నాయి. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్ ముందుకు కదలాలంటే స్వయంగా దరఖాస్తురులు వెళ్లి ముడుపులు చెల్లిస్తేకాని పనికాదు.. లేదంటే రోజుల తరబడి ఎదురు చూడాల్సిందే. అన్ని సక్రంగా ఉంటేనే పది, ఇంటర్ పరీక్షలకు అర్హులు. విద్యార్థుల ఆధార్, పుట్టినరోజు అలాగే తల్లిదండ్రుల ఆధార్ అన్ని సక్రమంగా ఉంటేనే పది, ఇంటర్ విద్యార్థుల పబ్లిక్ పరీక్షలకు ఫీజులు కట్టించుకుంటామని స్కూల్, కళాశాల యాజమాన్యలు చెప్తుంటడంతో విద్యార్థులు తల్లిదండ్రుల ఆందోళన చెందుతున్నారు. పైగా ఆధార్ సవరణకు అవసరమైన లేట్ డేడ్ ఆఫ్ బర్త్ సర్టిఫేకెట్స్ ఆలస్యం కూడా వారి ఆందోళనకు మరో కారణంగా చొప్పవచ్చు.

ఉన్నతాధికారులకు విన్నవించాం

కేంద్రం ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డులు ప్రక్రియ కోసం ఆధార్ కేంద్రాలు పెంచాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. సమస్యపై వివరించాం. అపార్ ఐడీ ప్రక్రియ వివరాల్లో తప్పులు లేకుండా చూడాలని వారు చెబుతున్నారు.

- నరేంద్రదేవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, వలేటివారిపాలెం

అక్రమంగా మట్టి తరలింపు

వింజమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందిగుంట గ్రామంలో ప్రభుత్వ భూమి నుంచి మట్టిని జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో భారీగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకో వడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. సిమెంటు రోడ్డు మార్జిన్ కోసమని చెప్పి ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్లకి తోలు కుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి రవాణా చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో తోలుతున్న మట్టి

న్యూస్ బాక్స్

మట్టి రోడ్డు వేయించాలని వినతి

లింగసముద్రం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):పొలాలకు వెళ్లే రోడ్డులోని చిల్లచెట్లు, పిచ్చి మొక్కలు తొలగించి మట్టి రోడ్డు వేయించాలని గంగపాలెం గ్రామస్థులు శనివారం ఎమ్మెల్యే ఇంటూరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో 150ఎకరాలు, లింగసముద్రం పాత చెరువు కింద 150ఎకరాలు భూమి ఉందన్నారు. ఈ దారిలో చెట్లు పెరిగి దారి మూసుకపోవడంతో ఏడేళ్లుగా రాకపోకలు సాగించడం లేదన్నారు. గ్రావెల్ రోడ్డు నిర్మిస్తే ట్రాక్టర్లు వరివిత్తనాలు తీసుకెళ్లేందుకు వీలుంటుందని గ్రామ టీడీపీ నాయకుడు చిరుమామిళ్ల శ్రీనివాసులు విన్నవించారు.

కారు అద్దాల ధ్వంసంపై కేసు

ఉదయగిరి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పార్కింగ్ చేసిన కారు అద్దాలను ధ్వంసం చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఏ రమణయ్య తన కారును పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో పార్కింగ్ చేశాడన్నారు. శుక్రవారం షేక్ జిలానీ అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేసినట్లు రమణయ్య ఫిర్యాదు చేశాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు జిలానీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థుల ర్యాలీ



కేంద్రం వద్ద ఆర్ఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

బిట్రగుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ డేను పురస్కరించుకుని శనివారం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీలోని పేద, అనాథలకు, అలాగే తాళ్లపాలెంలోని రూరల్ హెల్త్‌సెంటర్‌లోని రోగులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కొండాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 90శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళ పింఛన్లు మొత్తం 5245 ఉండగా వాటిలో 4,720 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారు. 1వ తేదీ జరగాల్సిన పింఛన్ల పంపిణీ ఒక రోజుముందుగానే చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

● ఉదయగిరి రూరల్ : మండలంలో 91.3 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో అప్పాజీ తెలిపారు. శనివారం ఆయన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి పలువురు లబ్ధిదారులకు నగదు అందజేశారు. అందుబాటులోని లేని లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నవాజ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు అడ్డా..



పోలినేనిపాలెం డంపింగ్‌యార్డు మందు బాబులకు అడ్డాగా మారింది. ఊరికి దూరంగా ఉండడంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇక్కడ మద్యం సేవించి మద్యం సీసాలను పగులగొట్టి వెళుతున్నారు. వీటిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఈ దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. .

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

ఇన్‌చార్జిలే దిక్కు

● పక్క మండలాల అధికారులకు అదనపు బాధ్యతలు

● వారు ఎప్పుడొస్తారో.. ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి

● మండల ప్రజలకు అందని ప్రభుత్వ సేవలు



వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయం

వలేటివారిపాలెం, నవంబరు 30: (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్, విద్య, వెలుగు, పంచాయతీరాజ్, ఆయుష్ వైద్యశాల, ఉద్యానవన, గ్రంథాలయం, బీసీ హాస్టల్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఇలా అన్నిశాఖలకు పూర్తిస్థాయి అధికారులు లేరు. పక్క మండలాల అధికారులే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. వారు ఎప్పుడు వస్తారో, వచ్చినా ఎంత సమయం ఉంటారో తెలియడంలేదు. వారంలో రెండు లేక మూడు రోజులు మాత్రమే విధులకు హాజరు అవుతున్నారు. దీంతో సరైన సేవలు అందక మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రెగ్యులర్ ఎంపీడీవో లేడు..

మండల పరిషత్ కార్యాలయానికి రెగ్యులర్ ఎంపీడీఓ లేరు. కార్యాలయంలో పనిచేసే పరిపాలనాధికారి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఎంఈఓ లేరు. కొండాపురం రెగ్యులర్ ఎంఈఓను లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. వెలుగు ఏపీఎం లేకపోవడంతో స్థానిక కార్యాలయంలో పనిచేసే సీసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ ఏఈ లేరు. లింగ సముద్రం పంచాయతీరాజ్ ఏఈకి వలేటి వారి పాలెం ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వలేటి వారి పాలెం ఆయుర్వేద వైద్యాధికారి లేక రెండేళ్ల అయ్యింది. ఈ సమస్యతో వైద్యశాల మూతపడి ఉంది. బీసీ హాస్టల్ వార్డెన్ లేక వరికుంటపాడు వార్డెన్‌కు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రంథపాలకుడు లేక ఉలవపాడు గ్రంథపాలకుడికి బాధ్యతలు అప్పగించారు. ఉద్యానవన శాఖ అధికారి లేక కందుకూరు ఉద్యానవన అధికారికే బాధ్యతలు అప్పగించారు. 21మంది పంచాయతీ కార్యదర్శుల్లో 5గురే రెగ్యులర్ కార్యదర్శులు. ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శికి ఐదారు పంచాయతీలు అప్పగించారు. ఒక్కో వీఆర్వోకు రెండు, మూడు రెవెన్యూ గ్రామాలు ఇచ్చారు. మొత్తం మీద 15గ్రామ సచివాలయాలలో 175మంది సచివాలయ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా 50శాతం మందిలోపు ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అన్నిశాఖలతో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలానికి పూర్తిస్థాయి అధికారులను నియమించాలని కోరుతున్నారు.

వర్షాలతో ఇంటి నుంచి బయటకు రాని జనం

● శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపిలేని వాన

● చలిగాలులకు జనం బెంబేలు

● పంటలు నష్టపోతామోనని రైతుల బెంగ

అల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ కారణంగా మండలంలో శుక్రవారం రాత్రి నుండి వర్షం కరుస్తుంది. ఎడతెరిపిలేని వానతో జనజీవనం స్తంభించిపోవడంతో రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. ఇప్పుడిప్పుడే వరినాట్లు పూర్తి చేసుకున్న రైతులు ఈ వర్షం ఎక్కడ నష్టాన్ని చేకూరుస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వరినాట్లు, పనులు నిలిచిపోయాయి. తీరప్రాంతంలో సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడడంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా బోట్లు, వలలను భద్రపరచుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ వారికీ అవగాహన కల్పిస్తూ సముద్రంలోకి వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): తెల్లవారు జామునుంచి ఎడతెరపి లేని వర్షం కురవడంతో బోగోలు, ఇబ్రహీంపేట బజారులో జన సంచారంలేక బోసిపోయాయి. రైల్వే ఎల్సీ గేట్ 144 పడమర ఆర్అండ్‌బీ రోడ్లపై, బృందావనం వీధిలో వర్షపునీరు నిల్వ ఉండిపోవడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాళ్లూరు కొత్తగిరిజన కాలనీలో విద్యుత్ లేకపోవడంతో విషపురుగు ఇళ్లలోకి వస్తాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. తెల్లగుంట గిరిజనకాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఏడాది అయినా విద్యుత్ తీగలు లాగకపోవడం ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.



అల్లూరులో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఎల్లోడే సంబరం



పసుపు దుస్తులతో చిన్నారులు

కావలి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొల్లమూడివీధిలోని నలందా హైస్కూల్‌లో శనివారం ఎల్లోడే సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు పసుపురంగు పండ్లు పోలిన వేషధారణలో చిన్నారులు కన్పించడంతో ప్రాంగణమంతా పసుపుమయంగా మారింది. కార్యక్రమంలో నలందా డైరెక్టర్ ఎండీ వసీం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువు కాదు.. బస్టాండే!



కొద్దిపాటి వర్షానికే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు నిలుస్తుండటంతో ప్రయాణికులతో పాటు వాహనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ ఆవరణతో పాటు రాకపోకలు సాగించే మార్గాలను సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు వేసే సమయంలో అయితే వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గాలు ఆలోచించక పోవడంతో ఈ సమస్య నెలకొంది. కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు నిలుస్తోంది. ఈ నీరు బస్సులు రాక పోకలు సాగించేటప్పుడు అటువైపు వస్తున్న ప్రయాణికులపై పడుతుంతోంది. వర్షం వెలిసిన తర్వాత కూడా రెండు మూడు రోజులు ఆ నీరు నిలిచి బస్టాండ్ ఆవరణం మురుగు కూపంగా మారి దోమలు పెరుగుతున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలి (ఆంధ్రజ్యోతి)

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

● ఆత్మకూరు ఆర్డీవో పావని



మాట్లాడుతున్న ఆర్డీవో పావని

ఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో బి.పావని సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రాణ, ఆస్తి, పంట నష్టం సంభవించినా, ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 24 గంటలు అధికారులు తమ ప్రాంతాల్లో ఉండాలని తెలిపారు. ప్రజలు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ కు ఫోన్‌చేసి తెలియజేయవచ్చన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను యుద్ధప్రా తిపదికన పునరావాస కేంద్రాలకు తరలించేందకు సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు

వరికుంటపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామాపురం, జీ.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రవికుమార్ రైతులకు సమాచార హక్కు చట్టం ఉద్దేశాలు, దరఖాస్తు నమోదు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో జీ.కొండారెడ్డిపల్లి సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, హరినాథ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజకు రూ. 2.62 లక్షల విరాళం



అయ్యప్ప భక్తబృందానికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో ఇటీవల ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి పడిపూజకు అయిన మొత్తం ఖర్చు రూ. 2.62 లక్షల రూపాయలను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి విరాళంగా ప్రకటించి దాతృత్వం చాటుకున్నారు. శనివారం అయ్యప్ప భక్తబృందానికి ట్రస్ట్ సభ్యులు చెక్కును అందజేశారు. అదేవిధంగా మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సాంబ శివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, నవంబరు 30(నవంబరు): మం డలంలో పల్లెపండుగ కింద మంజూరు చేసి న సిమెంట్ రోడ్డు నిర్మాణాలను త్వరితగతి న పూర్తిచేయాలని ఎంపీడీవో షాలెట్ సూ చించారు. శనివారం స్థానిక మండల పరిష త్ కార్యాలయంలో ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మా ట్లాడుతూ ప్రతిగ్రామంలో పల్లెపండుగ కింద సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయని, కొ న్నిపనులు జరుగుతుండగా మరికొన్ని పనులు ప్రారంభం కాలేదన్నారు. అన్ని పనులను డిసెంబరు నెలాఖరుకు పూర్తిచేయాలని కోరారు. అనంతరం వ్యవసాయ, ఇరిగేషన్, డ్వామా, డీఆర్‌డీఏ వెలుగు, హౌసింగ్, విద్యాశాఖ, ట్రాన్స్‌కో, ఐసీడీయస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుయస్, వైద్య ఆరోగ్యశాఖ, వెటర్నరీ, ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులు వారి పరిధిలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లానాయక్, జడ్పీటీసీ రావుల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

అల్లూరు (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎదురవుతోందని దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖ, రోడ్ల దుస్థితి, ఉపాధిహామీ, రెవెన్యూ సమస్యలు, వ్యవసాయ శాఖ విధి విధానాలు, హౌసింగ్ శాఖ, నీటి పారుదల శాఖలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అధికారులు వాటి వివరాలను సభ ముందు ఉంచగా అవసరమైన వాటిని వెంటనే పరిష్కరించేలా తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, తహసీల్దారు లక్ష్మీ నారాయణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన



మానవహారంలో పాల్గొన్న టీఆర్ఆర్ అధ్యాపకులు, విద్యార్థులు

కందుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్, మహిళా సాధికార విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మహమ్మారి బారినపడకుండా ఆరోగ్యకరమైన జీవనం సాగించాలని పలువురు అధ్యాపకులు సూచించారు. ఎయిడ్స్ ఇప్పటికీ సైలెంట్ కిల్లర్‌గా ఉందని, శరీర రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీసే ఎయిడ్స్‌కు ఇప్పటికీ మందు కనుగొననందున ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇటీవలి కాలంలో ఎయిడ్స్‌పై ప్రచారం తగ్గటం ప్రమాదకరమని అన్నారు. అనంతరం ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటపాటి నరేష్‌రాజ, షేక్ షానాజ్‌బేగం, రాజగోపాల్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు



పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ఏఎస్ పేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపర్చాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి సూచించారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపర్చాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పద్మజారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో భూ సమస్యల పరిష్కారం

● మస్తానయ్య, ఇన్‌చార్జి తహసీల్దారు, చేజర్ల



చేజర్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామసభల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు మస్తానయ్య సోమవారం తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

ఈ ఇంటర్వ్యూ

? రీసర్వే గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి.

! మండలంలో ఇప్పటివరకు ఆరు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాం. గతంలో జరిగిన రీసర్వేపై అభ్యంతరాలు ఉన్నచోట రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాం.

? ఇప్పటివరకు ఎన్ని అర్జీలు స్వీకరించారు.

! ఇప్పటివరకు రైతుల నుంచి 326 అర్జీలు వచ్చాయి. వాటిని త్వరలో పరిష్కరిస్తాం.

? సాగునీటి సంఘాల ఎన్నికల రైతు జాబితా సిద్ధం చేశారా.

! రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ముఖ్యంగా రెవెన్యూ పరిధిలో ఉన్న జాబితాను సిద్ధంచేసి ఉన్నతాధికారులకు నివేదించాము.

? ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

! ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు.

ఇలా ఉంటే దోమలు రావా ?



జంగంరెడ్డిపాలెం ఎస్టీ కాలనీలో కాలనీలోని అంతర్గత రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దోమలకు ఆవాసా లుగా మారాయి. ఇటీవల లింగసముద్రం వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గ్రా మాలలోని పిచ్చి మొక్కల తొలగింపునకు పం చాయతీ నిధులు వాడుకోవాలని అధికా రుల కు సూచించారు. అయినా అధికారులు చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

ఎన్ఆర్ఐలతో సీఎంని కలిసిన ఎమ్మెల్యే కాకర్ల

జలదంకి, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం అమెరికా ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్తలు విమల్‌కుమార్ కొలప్ప, సాయికిరణ్ కొలవెన్నులతో కలసి అమరావతిలో సీఎం నారా చంద్రబాబునాయుడును కలిశారు. సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఆర్ఐలను పరిచయం చేసి మాట్లాడించారు. రాష్ట్రంలో ఆగ్రోపామ్స్ తరహా పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీరు ముందుకొచ్చారని సీఎంకు తెలియజేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న వీరిని అభినందించారు. నియోజకవర్గ పరిధిలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు నెలకొల్పితే రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.



జోరుగా వరినాట్లు



మండలంలో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మాగాణి అత్యధికంగా ఉండటంతో అధికారికంగా 26వేల ఎకరాలు, అనధికారికంగా 14వేల ఎకరాలు వరి పంటను సాగు చేస్తారు. వరినాట్లు కోసం ఇతర ప్రాంతాల నుంచి కూలీలు ఇక్కడికి వస్తుంటారు. ఈ ఏడాది ఉత్తరాది నుంచే కాకుండా పశ్చిమ బెంగాల్ నుంచి కూడా వచ్చారు.

- అల్లూరు (ఆంధ్రజ్యోతి)